ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY





రెండు నెలల క్రితం వరకూ జిల్లా వాసి జగన్ సీఎం. ఆయన పాలనలో జిల్లాలో యథేచ్ఛగా భూఆక్రమణలు, ఇసుక, మట్టి, జూదం ఇలా అక్రమ దందాలు సాగాయి. ఇక ప్రతి పనిలో పర్సంటేజీలు తీసుకునే సంస్కృతిని ప్రవేశపెట్టారు. రాజశేఖరరెడ్డి హయాంలో కూడా ఇలాంటి పరిస్థితి లేదు. జగన్ సీఎం అయిన తరువాతనే ఇలాంటి పరిస్థితి తలెత్తింది. వైసీపీ అరాచకాలను ఐదేళ్లు మౌనంగా భరించిన జనం ఎన్నికల్లో కర్రువాత పెట్టి ఇంటికి పంపించేశారు. కూటమి అభ్యర్థులకు పట్టంగట్టారు. అయితే.. అధికారంలోకి వచ్చి రెండు నెలలుకాక ముందే టీడీపీ నేతలు మొదలుపెట్టిన కబ్జాలు, దౌర్జన్యాలు, దందాలు, సెటిల్‌మెంట్లు చూసి జనం స్టన్ అవుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భూకబ్జాలు, సెటిల్‌మెంట్లు, దాడులు, దౌర్జన్యాలకు పాల్పడవద్దంటూ ఇప్పటికే పలుమార్లు హెచ్చరించారు. వైసీపీ ఘోర ఓటమికి కారణం కూడా ఇవే అని చెప్పారు. అయినా వైసీపీ నేతలకు ఏమాత్రం తీసిపోని విధంగా కూటమి నేతలు వ్యవహరిస్తూ.. సేమ్ టు సేమ్ అని పేరు తెచ్చుకుంటున్నారు. ప్రభుత్వం వచ్చి రెండు నెలలు కాక ముందే పెనంలో నుంచి పొయ్యిలో పడ్డామంటూ జనం వాపోతున్నారు.



- యథేచ్ఛగా భూఆక్రమణలు.. మట్టి, ఇసుక దందా
- కడపలో పులివెందుల పెత్తనం
- రెండు బార్లు స్వాధీనం.. ఒకటి సెటిల్‌మెంటు
- వివాదాస్పద స్థలాల్లోకి అడుగు పెడుతున్న వైనం
- జిల్లాలో అన్నిచోట్లా ఇదే తంతు
- జగన్ పాలనలో జనం హాహాకారాలు..
- అదే తీరులో కొందరు టీడీపీ నేతలు

సేమ్ టు సేమ్

(కడప-ఆంధ్రజ్యోతి): ఎన్డీయే కూటమి ప్రభుత్వం జూన్ 12న ప్రమాణ స్వీకారం చేసింది. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యారు. జూలై 1న రూ.7వేలు పింఛన్, ఉద్యోగులకు జీతాలు అందించారు. ఆగస్టు 1న కూడా పెన్షన్లు, ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇచ్చారు. క్షేత్రస్థాయిలో చంద్రబాబుపై ఫీల్‌గుడ్ వాతావరణం ఉంది. అయితే వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన కొందరి వల్ల చంద్రబాబుకు చెడ్డపేరు వచ్చే పరిస్థితి ఏర్పడుతోంది. జిల్లాలో టీడీపీ ముసుగున కొందరు చేస్తున్న భూకబ్జాలు, సెటిల్‌మెంటు దందాలు చూసి ఔరా అంటూ పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. జగన్ ప్రభుత్వంలో కూడా ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడలేదంటూ వాపోతున్నారు. ఇవి చంద్రబాబుకు మైనస్‌గా మారిపోతున్నాయి.

జిల్లా కేంద్రం కడపలో

జిల్లా హెడ్‌క్వార్టర్ కడప. వైసీపీ హయాంలో అప్పటి కీలక నేతలు చేసిన దౌర్జన్యాలు, దందాలు, వేధింపులు, పెట్టిన అక్రమ కేసులు భరించలేక జనం ఈసారి టీడీపీకి జై కొట్టారు. అయితే అధికారంలోకి వచ్చిన తరువాత ఇక్కడ సీన్ రివర్స్ అవుతోంది. కడపలో పులివెందుల నియోజకవర్గానికి చెందిన మాజీ జడ్పీటీసీ, మరో మాజీ ప్రజాప్రతినిధి గ్యాంగ్ కడపలో తిష్టవేసి సెటిల్‌మెంట్లు చేశారంటారు. వివాదాల్లో ఉన్న స్థలాలను గుర్తించి అక్కడ పులివెందుల మార్క్ పంచాయితీ చేస్తున్నట్లు చెబుతున్నారు. దశాబ్దం క్రితం వచ్చిన పోకిరి సినిమాలో "ఈ అపార్ట్‌మెంటు బాగుంది.. ఓ ప్లాట్ నాకు కావాలి. రిజిస్టరు చేసివ్వు" అంటూ పోలీసు కేరక్టరుగా ఉన్న ఓ అధికారి బిల్డర్‌కు ఆర్డర్ వేస్తాడు. పులివెందుల బ్యాచ్ పోకిరి సినిమాలో ఆ డైలాగ్‌ను బాగా వంట బట్టించుకుంటున్నారు. విలువైన స్థలాలు ఉంటే ఇది మా అడ్డా అంటూ రియల్టర్లను బెదిరించి ఆస్తులను స్వాధీనం చేసుకుని అటు ప్లాట్లు, ఇటు లేఅవుట్లు వాటాలుగా పంచుకుంటున్నారు.

- కడపలో లిక్కర్ డాన్‌గా పేరొందిన వ్యక్తులకు చెందిన రెండు బార్లు టీడీపీ నేతలు స్వాధీనం చేసుకోవడం సంచలనంగా మారింది. ఈ రెండు బార్లు పులివెందులకు చెందిన ఇద్దరు మాజీ ప్రజాప్రతినిధులు చేజిక్కించుకున్నారు. అలాగే మరో బార్‌కు సంబంధించి నెలనెలా మామూళ్లు ఇచ్చేలా సెటిల్‌మెంట్ చేసుకున్నారు.
- అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలోనే కడపనగరంలోని రాజరాజేశ్వరి కళ్యాణమండపం పక్కన ఓ వివాదాస్పద స్థలంలోకి ప్రవేశించి దౌర్జన్యం చేసి ఆ బ్యాచ్ రూ.25లక్షలకు సెటిల్ చేసినట్లు చెబుతారు. వీళ్లంతా గతంలో వైసీపీకి చెందిన వారే.
- వైసీపీ హయాంలో కడప ఎక్సైజ్ డిపో పరిధిలో బ్రాంది షాపులకు లిక్కర్‌ను ఓ వైసీపీ నేత సరఫరా చేసేవారు. అందులో వచ్చే ఆదాయం కార్యకర్తలకు అందించేవారు. ఇప్పుడు అదే కాంట్రాక్ట్‌ను టీడీపీ నేతలు తీసుకున్నారు. ఆదాయం కార్యకర్తలకు బదులు ఓ నేత తీసుకుని 30 శాతం వైసీపీ నేతలకు ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నారని సమాచారం.
- రిమ్స్‌లో ఔట్‌సోర్సింగ్ ఇతర హోటళ్లు, మెడికల్ స్టోర్‌లు ఉన్నాయి. వీటిలో అక్రమాలు జరిగాయంటూ గతంలో గర్జించి.. ఇప్పుడు ఔట్ సోర్సింగ్ నిర్వహణ నుంచి నెలకు రూ.5 లక్షలు ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారని ప్రచారం సాగుతోంది. ఓ వికలాంగుడు ఇక్కడ జగన్ హయాం నుంచి మెడికల్ స్టోరు నడుపుతున్నాడు. అతనితో కూడా ప్రస్తుత బ్యాచ్ నెలమామూళ్లు ఇచ్చేలా సెటిల్ చేసుకున్నారు.
- ఇక బుడ్డాయపల్లె చెరువు నుంచి పాత కడపకు చెందిన ఓ నేత అడ్డగోలుగా మట్టి తోలుతున్నారు. "పత్రికల్లో వార్తలు వచ్చినా ఏమీ చేయలేరు, మా వెంట్రుక కూడా పీకలేరు" అంటూ సన్నిహితుల వద్ద మాట్లాడినట్లు చెబుతారు. కడప నగరం చలమారెడ్డిపల్లెలో గ్రావెల్ ఓనరు నుంచి రూ.50లక్షలకు సెటిల్‌మెంటు చేసుకున్నట్లు చెబుతారు.

బద్వేలులో బ్యాచ్

ఇక బద్వేలు నియోజకవర్గంలో చెన్నంపల్లెకు చెందిన ఓ బ్యాచ్ ఇష్టారాజ్యంగా కబ్జాలకు పాల్పడుతోంది. వైసీపీ హయాంలో బద్వేలును కబ్జాలకు కేరాఫ్‌గా మార్చారు. అక్కడ స్థలం కొన్న వారు వణికిపోయారు. ఇప్పుడు అదే ఫార్ములాను ఓ మాజీ ప్రజాప్రతినిధి గ్యాంగ్ అమలు చేస్తుండడం చూసి జనం భయపడుతున్నారు. మాజీ ప్రజాప్రతినిధిసొంత ఏరియాకు చెందిన ఓ కౌన్సిలర్, కొంతమంది సొంత సామాజిక వర్గీయులు బద్వేలులో ఆస్తులు కబ్జా చేస్తున్నారు. పోరుమామిళ్ల, బి.కోడూరులో కూడా ఇష్టారాజ్యంగా దందాలకు పాల్పడుతున్నారు.

ప్రొద్దుటూరులో తగ్గేదేలే..

జగన్ పాలనలో ప్రొద్దుటూరులో వైసీపీ కీలక నేతలు, అనుచరులు, డ్రైవర్లు, గన్‌మెన్లు మాత్రమే ఇసుక లూటీ చేసేవారు. కూటమి వచ్చాక.. ఎన్నికల ముందు టీడీపీలోకి వచ్చిన వైసీపీ నేతలతో కలిసి అందరూ ఇసుక లూటీ చేస్తున్నారు. రామాపురం, పెద్దశెట్టిపల్లె, దొరసానిపల్లె, రామేశ్వరం, చౌడూరు, కల్లూరు, నంగనూరు, రేవులపల్లె నుంచి ఇసుకను దోచుకుంటున్నారు. ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాల్లో కుందూనది విస్తరణలో తీస్తున్న మట్టిని కూడా అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. వైసీపీ హయాంలో మట్కా, క్రికెట్ బెట్టింగ్‌లకు ప్రొద్దుటూరు నిలయంగా మారింది. కూటమి వచ్చిన తరువాత మళ్లీ మట్కా, బెట్టింగ్, పేకాట కంటిన్యూగా జరగడం గమనార్హం. ప్రొద్దుటూరు మండలంలోని చౌటపల్లె, దొరసానిపల్లె, సోములవారిపల్లె, గోపవరం ప్రాంతాల్లో భారీ ఎత్తున జూదం నడుస్తోంది. టీడీపీ నేతల ఈ విపరీత ధోరణికి అడ్డుకట్ట వేయకపోతే చంద్రబాబు ప్రభుత్వం జగన్‌ను మించిన చెడ్డపేరును మూటగట్టుకోవాల్సి ఉంటుందని టీడీపీ వీరాభిమానులు, ప్రజలు హెచ్చరిస్తున్నారు.

పులివెందులలో అన్నీ స్వాధీనం

టీడీపీ ఎన్నికల్లో విజయదుందుభి మోగించినప్పటి నుంచి పులివెందుల నియోజకవర్గంలో టీడీపీ ఆగడాలు పెరిగిపోయాయి. ఎన్నికల ఫలితాలు వెలువడిన రాత్రే పులివెందులలో కొందరు చోటామోటా నాయకులు వైసీపీ నాయకుల ఇళ్ల వద్ద హల్‌చల్ చేశారు.

- పులివెందుల ప్రాంతంలో ఉన్న ముగ్గురాయి గనుకు సంబంధించి ప్రభుత్వ లీజు ఉన్నా సరే.. మేము చెప్పిన వారికే ఇవ్వాలని అన్నిటిని స్వాధీనంలోకి తీసుకున్నారు.
- చిత్రావతి నది, నుంచి వేంపల్లె పాపాఘ్నినది నుంచి ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్నారు. రాత్రి 10గంటల నుంచి ఈ రవాణా ప్రారంభమవుతుందని పులివెందుల ప్రాంత ప్రజలే అంటున్నారు.
- రేషన్ డీలర్ల విషయానికి వస్తే పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో ఒక నాయకుడు, రూరల్ ప్రాంతంలో మరో నాయకుడు పెత్తనం సాగిస్తున్నారు. వేంపల్లె, తొండూరు, వేముల, చక్రాయపేట, లింగాల, సింహాద్రిపురం మండలాల్లో ఆయా నాయకులు రేషన్ షాపులను వారికి అనుకూలమైన వారికి అప్పగించి రేషన్ పంపిణీ సాగిస్తున్నారు.
- నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ఉన్న ఆర్వో ప్లాంట్లను టీడీపీ కార్యకర్తలు, చోటామోటా నాయకులు తీసుకొని వారికి నచ్చినవారికి అప్పగించారు.
- పులివెందుల మార్కెట్ యార్డులో వైసీపీ ప్రభుత్వ హయాంలో తీసుకున్న వారిని విధుల నుంచి తొలగించాలని ఓ నాయకుడు హుకుం జారీచేశారు. అలాగే జేఎన్టీయూ, మెడికల్ కళాశాల, ట్రిపుల్‌ఐటీ తదితర ప్రభుత్వ కొలువుల్లో 2019 నుంచి విధుల్లోకి తీసుకున్న వారందరిని తొలగించి తాము చెప్పిన వారిని విధుల్లోకి తీసుకోవాలని నాయకులు పట్టుబడుతున్నారు.
- పులివెందుల మున్సిపాలిటీతో పాటు మండలాలను ఓ నాయకుడి తమ్ముళ్లు, చిన్నాన్నలు కేటాయించుకుని హల్‌చల్ చేస్తున్నారని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. పులివెందులలో, వేంపల్లెలో ఉన్న బార్‌లు సైతం మా ఆధీనంలోనే ఉండాలని టీడీపీ నేతలు పర్సెంటేజీలు మాట్లాడుకున్నట్లు తెలిసింది. పులివెందుల నియోజకవర్గ నాయకుడికి చెందిన కోటరీ ఆ నియోజకవర్గంలో హల్ చల్ చేస్తోంది.
- ఇక మట్కా, గ్యాంబ్లింగ్ ఆ ఇరువురునాయకుల కనుసన్నల్లోనే సాగుతోంది. వేంపల్లెలో మట్కా రాసుకుంటానని ఒక వ్యక్తి ఒక నాయకుడిని కలిసి అడిగితే.. ఆయన మట్కా వద్దు గ్యాంబ్లింగ్ ఆడించుకో పోలీసులకు చెబుతామని చెప్పారు. కానీ ఆ వ్యక్తి ప్రజాప్రతినిధి వద్దకెళ్లి మట్కా రాసుకుంటానని చెప్పడంతో ఆయన నేరుగా సీఐకి ఫోన్ చేసి మట్కా రాసుకోనివ్వండి అని చెప్పినట్లు సమాచారం. పులివెందులలో విచ్చలవిడిగా మట్కా రాస్తున్నా ప్రశ్నించలేని దీనస్థితిలో అక్కడి పోలీసు యంత్రాంగం ఉంది. మరీ వింతేమిటంటే పులివెందుల పట్టణంలో ఒక ప్రాంతంలోని ఒక వ్యక్తి మరో ప్రాంతంలో మట్కా రాస్తే ఆ డబ్బులను అదే ప్రాంతానికి చెందిన మట్కా బీటర్లకు ఇవ్వాలని ఓ నాయకుడు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. ఆ నియోజకవర్గానికి చెందిన ప్రధాననాయకుల రెండు బ్యాచ్‌లు మట్కానే రాబడిగా పెట్రేగిపోతున్నారు.
- కొందరు చోటామోటా నాయకులు పులివెందుల పట్టణంతో పాటు ఆ నియోజకవర్గంలో పలుచోట్ల ఏకంగా వేరేవారి ప్లాట్లను కబ్జా చేసి ఇళ్లు కట్టుకుంటున్నారని ప్రచారం సాగుతోంది.



కె.వెలమవారిపల్లె కొండను అక్రమంగా తవ్వేస్తున్న దృశ్యం

బ్రహ్మంగారిమఠం మండలం పలుగురాళ్లపల్లె వద్ద కొండను గుల్ల చేస్తూ తవ్వకాలు చేసిన దృశ్యం



రాజోలి జలాశయం వద్ద నుంచి నీటిని వదులుతున్న మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్



రాజోలి నిర్మాణం పూర్తి చేస్తాం

- ఎమ్మెల్యే పుట్టాసుధాకర్ యాదవ్

మైదుకూరు రూరల్, ఆగస్టు 2: సీఎం చంద్రబాబు సహకారంతో రాజోలి నిర్మాణం పూర్తి చేసి రాయలసీమను సస్యశ్యామలం చేసేందుకు కృషి చేస్తామని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. రాజోలి జలశయం వద్ద శుక్రవారం స్లూయిస్ నుంచి కృష్ణా జలాలను మైదుకూరు, చాపాడు, ఖాజీపేట, దువ్వూరు కాలువలకు ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేసీ ఆయకట్టు కింద సుమారు 92 వేల ఎకరాలలో రైతులు పంటలు పండించనున్నారని అన్నారు. వీరందరికీ సకాలంలో నీరు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. కాగా.. కేసీ కెనాల్‌కు నీటి విడుదలపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు, ధనపాల జగన్, అన్నవరం సుధాకర్‌రెడ్డి, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళపై టీడీపీ నాయకుడి దాడి

బద్వేలు టౌన్, ఆగస్టు 2: బద్వేలు మండల పరిధిలోని సి.కొత్తపల్లె గ్రామ సర్వేనెంబర్ 54/1, 54/2, 54/3, 54/4 భూమిలో కొద్ది రోజుల క్రితం వామపక్షాల ఆధ్వర్యంలో పేదలు గుడిసెలు వేశారు. ఇక్కడికి శుక్రవారం టీడీపీ నేత రామచంద్రారెడ్డి తన అనుచరులతో వెళ్లారు. అక్కడున్న మహిళలతో గుడిసెలు ఎందుకు వేశారని, ఇది తన స్థలమని మాట్లాడారు. వారు మాట్లాడుతూ.. తాము ప్రభుత్వభూమిలో గుడిసెలు వేసుకున్నామని చెప్పారు. దీనిపై వాగ్వాదం పెరగడంతో రామచంద్రారెడ్డి, ఆయన అనుచరులు మహిళపై దాడి చేశారు. ఈ సందర్భంగా అడ్డువచ్చిన మరికొందరు మహిళలతోపాటు మగవారిని కూడా కొట్టినట్లు పేదలు ఆవేదన వ్యక్తం చేశారు. దెబ్బలు తిన్న మహిళలు నేరుగా ప్రభుత్వాసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నారు. కొద్ది రోజులుగా వామపక్ష నాయకులు పేదలతో కలసి వేసిన గుడిసెలపై అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోడం విమర్శలకు తావిస్తోంది. ఇటీవల సిద్దమ్మతల్లి గుడి వద్ద కూడా స్థానికులు, స్థానికేతరులకు మధ్య ఇలాంటి సంఘటనే చోటు చేసుకుంది. అక్కడ కూడా టీడీపీ నాయకులు దౌర్జన్యం చేశారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భూసేకరణ పెండింగ్ పనులు క్లియర్

- కలెక్టర్ లోతేటి శివ శంకర్

కడప(కలెక్టరేట్), ఆగస్టు 2: జాతీయ రహదారుల అభివృద్ధి పనుల్లో భాగంగా ప్రభుత్వ లక్ష్యం మేరకు జిల్లాలో చేపడుతున్న భూసేకరణ, అటవీ, పర్యావరణ అభ్యంతరాల క్లియరెన్స్ పూర్తి చేశామని కలెక్టర్ లోతేటి శివశంకర్ పేర్కొన్నారు. శుక్రవారం విజయవాడ నుంచి ప్రభుత్వప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ జాతీయ రహదారుల అభివృద్ధి,విస్తరణ పనులకు సంబంధించి భూసేకరణ అంశాలపై కలెక్టర్లు, జేసీలు, డీఎఫ్‌ఓలు, ఎన్‌హెచ్ఐ అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి కలెక్టర్‌తో పాటు జేసీ కలెక్టర్ అదితిసింగ్, డీఎఫ్‌వో సందీప్‌రెడ్డి హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ జిల్లా మీదుగా వెళ్తున్న జాతీయ రహదారులు, రైల్వే లైన్ల నిర్మాణం, వాటి అభివృద్ధికి అదనంగా చేపడుతున్న భూసేకరణ పనులను వేగవంతం చేస్తున్నామన్నారు. అటవీ, పర్యావరణ అభ్యంతరాలు, సవాళ్లు, కోర్టు కేసులు సంబంధిత అంశాలను అధిగమించామన్నారు. ప్రభుత్వ లక్ష్యం మేరకు భూ సేకరణకు సంబంధించి భూముల కన్వర్షన్, మ్యుటేషన్ పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవోలు వెంకటపతి, వెంకటేశ్వర్లు, ఎన్‌హెచ్ఏఐ పీడీ వేణుగోపాల్, ఆర్‌అండ్‌బీ, నేషనల్ హైవే ఈఈ విజయభాస్కర్‌రెడ్డి, ఫారెస్ట్, రెవెన్యూ, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

చేనేతలకు ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకొస్తాం

జిల్లాలో చేనేతల ఉత్పత్తులకు ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ లోతేటి శివశంకర్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబరులో జిల్లా చేనేత, జౌళి సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు నాగరాజారావు అధ్యక్షతన మైలవరం మండలంలోని టెక్స్‌టైల్ పార్కు అభివృద్ధి పనుల పురోగతిపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం యూనియన్ బ్యాంకు ఆర్ఎం లక్ష్మీతులసి చేనేతలకు రుణ సదుపాయం గురించి వివరించారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జీఎం జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

14 మంది సీఐల బదిలీ

కడప (క్రైం), ఆగస్టు 2: జిల్లాలో పనిచేస్తున్న 14మంది సీఐలను బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. నంద్యాల జిల్లా ఆత్మకూరులో పనిచేస్తున్న నాగభూషణంను బద్వేలు రూరల్‌కు, బద్వేలులో పనిచేస్తున్న యుగంధర్‌ను పీలేరుకు, పాకాలలో పనిచేస్తున్న ఎం.రాజగోపాల్‌ను బద్వేలు టౌన్‌కు, ఒంటిమిట్టలో పనిచేస్తున్న పురుషోత్తం రాజును కడప వీర్‌కు, కడప వీర్‌లో పనిచేస్తున్న మోహన్ కుమార్‌ను ఒంటిమిట్టకు బదిలీ చేశారు. రైల్వే కొండాపురంలో పనిచేస్తున్న వేణుగోపాల్‌ను కడప వీర్‌కు, అన్నమయ్య జిల్లా సీసీఎస్ నుంచి మహ్మద్ రఫీని రైల్వేకొండాపురానికి, పులివెందులలో ట్రాఫిక్ నుంచి సురేశ్‌రెడ్డిని వేంపల్లెకు, కమలాపురం నుంచి రామకృష్ణారెడ్డిని ప్రొద్దుటూరు 1 టౌన్‌కు, బద్వేలు రూరల్ నుంచి విక్రంసింహను ఎమ్మిగనూరుకు, ప్రొద్దుటూరు ఫ్యాక్షన్ జోన్‌లో పనిచేస్తున్న కంబగిరి రాముడును ఆళ్లగడ్డ రూరల్‌కు, ప్రొద్దుటూరు టూ టౌన్‌లో పనిచేస్తున్న అబ్దుల్ కరీంను కడప వీర్‌కు, ప్రొద్దుటూరు ట్రాఫిక్‌లో పనిచేస్తున్న యుగంధర్‌ను ప్రొద్దుటూరు టూటౌన్‌కు, వేంపల్లెలో పనిచేస్తున్న చాంద్‌బాషాను పత్తికొండకు బదిలీ చేశారు.

సబ్‌కలెక్టరేట్‌లో కాలిపోయిన ఫైళ్లు, వస్తువులు ఇవే..

- పోలీసులకు ఆర్డీవో ఫిర్యాదులో వివరాలు

మదనపల్లెటౌన్, ఆగస్టు 2: మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో జూలై 21వ తేది రాత్రి ఫైళ్ల దహనం ఘటనలో వివరాలు ఒక్కొక్కటి వెలుగులోకి వస్తున్నాయి. ఫైళ్ల దహనం జరిగిన మరుసటిరోజు (సోమవారం) ఆర్డీవో హరిప్రసాద్ వన్‌టౌన్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పలు అంశాలు వున్నాయి. సబ్‌కలెక్టరేట్‌లో చోటుచేసుకున్న మంటల వలన పలు కంప్యూటర్లు, మానిటర్లు, ఒక జిరాక్స్ మిషన్, సిస్టమ్, ప్రింటర్లు, స్కానర్లు కాలిపోయాయని ఫిర్యాదులో తెలిపారు. దీంతో పాటు సీనియర్ అసిస్టెంట్ జి.గౌతమ్‌తేజ విధులు నిర్వహించే సెక్షన్‌లో 22-ఏ ఫైళ్లు, చుక్కల భూముల ఫైళ్లు, అసైన్‌మెంట్ ఫ్రీహోల్డ్ ఫైళ్లు పూర్తిగా దహనమయ్యాయని తెలిపారు. అలాగే జూనియర్ అసిస్టెంట్ యతీషా విధులు నిర్వహించే ఆర్‌టీఐయాక్టు ఫైళ్లు, సినియర్ అసిస్టెంట్ శిల్ప విధులు నిర్వహించే సెక్షన్‌లోని అసైమెంట్ ఫైళ్లు, అసైన్‌మెంట్ అప్పీళ్లు, ప్రధానంగా కురబలకోట మండలంలో నిర్మాణంలో నిలిచిపోయిన ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఆర్‌అండ్‌ఆర్ ఫైళ్లు కాలిబూడిదయ్యాయని ఫిర్యాదులో తెలిపారు. దీంతో పాటు ఎలెక్షన్ డిప్యూటీ తహసీల్దార్ అస్లాంబాషా విధులు నిర్వహించే సెక్షన్‌లోని ఎన్నికల ఫైళ్లు, హార్సిలీహిల్స్ టౌన్‌షిప్ ఫైళ్లు, రిట్ పిటిషన్ ఫైళ్లతో పాటు అస్లాంబాషా సర్వీసు రిజిస్టర్ కూడా కాలిపోయిందని పేర్కొన్నారు. ఈ ఘటనపై విచారించాల్సిందిగా ఆర్డీవో హరిప్రసాద్ వన్‌టౌన్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. మొత్తం మీద 2400 పైగా ఫైళ్లు పూర్తిగా కాలిబూడిద కాగా, 700 ఫైళ్లు సగం కాలి మిగిలిపోయాయి. వీటిని పోలీసులు ఏ సెక్షన్‌లో ఎన్ని కాలిపోయాయి.. మిగిలిన అవశేషాలు ఎన్ని... అన్న వివరాలను నమోదు చేసి ప్రత్యేక సంచుల్లో సబ్‌కలెక్టరేట్ వరండాలో వుంచారు.



మిగిలిన వస్తువులు, ఫైళ్ల అవశేషాలను సంచుల్లో వేసిన దృశ్యం

ఫైళ్ల రికవరీలో పొరపాట్లు లేకుండా చూడాలి

సబ్‌కలెక్టరేట్‌లో ఫైళ్ల దహనం సంఘటనలో కాలిపోయిన ఫైళ్లు, సగం కాలిపోయి మిగిలిన ఫైళ్ల వివరాలను డివిజన్‌లోని 11 మండలాల తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ఎలాంటి పొరపాట్లు లేకుండా రికవరీ చేయాలని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ ఆదేశించారు. శుక్రవారం బి.కొత్తకోట తహసీల్దార్ కార్యాలయంలో తనిఖీలు చేసిన సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ 22-ఏ ఫైళ్లు, అసైన్‌మెంట్ ఫైళ్లు, హార్సిలీహిల్స్ టౌన్‌షిప్‌కు సంబంధించిన ఫైళ్లు, రిట్ పిటీషన్లను ఆయా విభాగం సిబ్బంది ఒక్కొక్కటి పరిశీలించి నకలు తీయాల్సి వుందన్నారు. ఈ ప్రక్రియలో ఎవరైనా తప్పులు, పొరపాట్లు చేస్తే కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి వుంటుందని సబ్‌కలెక్టర్ హెచ్చరించినట్లు తెలిసింది.

ఇంకా పోలీసు బందోబస్తు మధ్యే గదులు

మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో ఫైళ్ల దహనం ఘటన జరిగి నేటికి 12 రోజులు గడుస్తున్నా కాలిపోయిన సబ్‌కలెక్టర్ కార్యాలయం ఇంకా పోలీసు బందోబస్తులోనే వుంది. ఈ కేసు సీఐడీ అధికారులకు బదిలీ అయ్యే అవకాశాలు వుండటంతో, కాలిపోయిన ఘటన ప్రాంతాలను సీఐడీ అధికారులు మళ్లీ పరిశీలించవచ్చని తెలుస్తోంది. దీంతో ఈ భవనాన్ని ఇంకా సబ్‌కలెక్టర్‌కు అప్పగించలేదు.



ఈడీ బదిలీతో.. ఆర్టీసీ ఉద్యోగుల్లో

మార్పు వచ్చేనా?

- ఐదేళ్లుగా వైసీపీతో అంటకాగిన వైనం

కడప (మారుతీనగర్), ఆగస్టు 2: రోజూ లక్షలాది మంది ప్రయాణీకులను వారి గమ్యస్థానాలకు చేర్చే ఆర్టీసీ సంస్థలో కండక్టర్లు, డ్రైవర్లు, మెకానిక్‌లతో పాటు డిపో స్థాయి, రీజియన్ స్థాయి, జోన్ స్థాయి అధికారులుంటారు. గతంలో వీరంతా ఆర్టీసీని లాభాల బాట పట్టించేందుకు శ్రమించే వారేగానీ రాజకీయ రంగును పెద్దగా పులుముకునే వారు కాదు. అయితే.. వైసీపీ ఆవిర్భావం నుంచి జిల్లాలోని ఆర్టీసీలో పనిచేసే వారిలో వైసీపీ సానుభూతి పరుల సంఖ్య క్రమక్రమంగా పెరిగింది. ఎంతలా అంటే కింది స్థాయి కార్మిక యూనియన్ నాయకుల నుంచి పైస్థాయి అధికారుల వరకూ పాకింది. ఇది వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 2019 నుంచి 2024 సంవత్సరం అధికారం కోల్పోయే వరకూ పతాక స్థాయికి చేరిందనే విమర్శలున్నాయి.

ఆ క్రమంలో పులివెందుల డిపోలో పనిచేసే ఇద్దరు డ్రైవర్లు అప్పట్లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో వైసీపీకి సహకరించేలేదని కక్ష సాధింపు చర్యలో భాగంగా ఇతర జిల్లాలకు వారిని ఓ అధికారి అకారణంగా బదిలీ చేశారు. ఇలా వైసీపీ అధికారంలో ఉన్నపుడు అప్పటి డిప్యూటీ సీఎం చెప్పారని, ఛైర్మన్ ఆదేశించారని వైసీపీతో అంటకాగుతూ పలువురు అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరించినట్లు సమాచారం. ఆ కోవలో వైసీపీ సానుభూతి పరులైన కండక్టర్లను, డ్రైవర్లను ఔట్ ఆఫ్ డిజిగ్నేషన్ (ఓడీ) పేరుతో కూర్చోబెట్టి మరీ జీతాలిచ్చారనే ఆరోపణలు పలు డిపోలలో చక్కర్లు కొడుతున్నాయి. వారు చేసే కండక్టర్, లేదా డ్రైవర్ ఉద్యోగం కాకుండా ఇతర పనిపాటా లేని జల్సా బుల్లోడు లాంటి పని కల్పించారనే విమర్శలున్నాయి. వాస్తవంగా ఆరోగ్యం బాగాలేని కార్మికులను విజయవాడలోని ఆర్టీసీ ప్రధాన హాస్పిటల్‌లో చెకప్ చేసి ఓడీ డ్యూటీలివ్వడం పరిపాటి. అలాంటిది నిబంధనలకు పాతరేసి జిల్లాలో 10 నుంచి 15 మంది కార్మికులకు ఓడీ డ్యూటీలిచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారం చేపట్టగానే ఓడి డ్యూటీలు చేస్తున్న వారిలో కొంతమంది తిరిగి వారి వారి డ్యూటీలలో గుట్టు చప్పుడు కాకుండా చేరినట్లు తెలిసింది.

వైసీపీకి అంటకాగుతారా.. దారికొస్తారా

కడప జోన్ స్థాయి అధికారి గత వైసీపీ ప్రభుత్వానికి అనుకూలంగా విధులు నిర్వహించారనే ఆరోపణలున్నాయి. ప్రస్తుత రాష్ట్ర రవాణాశాఖమంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఆదేశాలను సైతం ఆయన ఖాతరు చేయకుండా, మంత్రి ఫోన్ చేసినప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలతో ఇటీవల ఆయనను హెడ్ ఆఫీసుకు బదిలీ చేసిన సంగతి తెలిసిందే. కడప రీజియన్ పరిధిలో గల వివిధ డిపో స్థాయి అధికారులు గత వైసీపీ ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేసి ఇతర యూనియన్ల కార్మికులను ఇబ్బందులకు గురిచేశారనే విమర్శలున్నాయి. ప్రధానంగా కడప డిపో స్థాయి అధికారితో పాటుగా అక్కడ ఫైనాన్స్ అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేసే ఓ అధికారి, అలాగే రీజియన్ స్థాయి అధికారి, ఈడీ ఆఫీసులో సేవలందించే ఓ డిప్యూటీ సూపరింటెండెంట్, మరో ఇద్దరు అసిస్టెంట్ మేనేజర్లు, గత కొన్ని సంవత్సరాలుగా బదిలీ కాకుండా అదే ఆఫీసులో ఫెవికాల్ వీరుల్లా అతుక్కుపోయారు. వీరు వైసీపీ వారికి జీ హుజూర్ అంటూ సేవలందించారనే ఆరోపణలున్నాయి. జిల్లాలోని ఇతర డిపోలలో సైతం వీరికి ఏ మాత్రం తీసిపోని రీతిలో పనిచేస్తున్న వారి సంఖ్య చాలానే ఉందనే సమాచారం. ఈడీ బదిలీ కావడంతో ఇకనైనా వీరిలో మార్పు వస్తుందా లేక ఇంకా వైసీపీ వాసనతోనే అంటకాగుతారా అని ఆర్టీసీ ఉద్యోగుల్లో చర్చ నడుస్తోంది.



ఫైనాన్స్ వ్యాపారి వేధింపులతో వ్యక్తి ఆత్మహత్య

- వడ్డీ పేరుతో లక్షలు వసూలు
- చొక్కా పట్టుకుని బాధితుడిపై వడ్డీ వ్యాపారి దాడి
- అవమానభారం తట్టుకోలేక ఆత్మహత్య
- భార్య పిల్లలకు న్యాయం జరిగేవరకు పోరాటం
- ఉప్పరపల్లె ఎంపీటీసీ నిరంజనరెడ్డి, బంధువులు

కడప (క్రైం)/ చెన్నూరు, ఆగస్టు 2: తీసుకున్న డబ్బుకంటే.. అధిక వడ్డీలతో డబ్బులు వసూలు చేసి వేధింపులకు పాల్పడటమే కాకుండా.. అతన్ని నడిరోడ్డులో చొక్కా పట్టుకుని దాడి చేసి అవమానించడంతో గాజులపల్లె శివనాథరెడ్డి (42) అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన చెన్నూరు మండలం ఉప్పరపల్లెలో గురువారం చోటు చేసుకుంది. మృతుని భార్య, బంధువుల ఫిర్యాదు మేరకు చెన్నూరు పోలీసులు వడ్డీ వ్యాపారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాలిలా..

చెన్నూరు మండలం ఉప్పరపల్లెకు చెందిన గాజులపల్లె శివనాథరెడ్డి భార్య గంగాదేవి, కుమార్తె పూజిత (13), కుమారుడు కౌశిక్‌రెడ్డి(11)లతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. శివనాథరెడ్డి గత పదేళ్లుగా కడప ఏడురోడ్ల కూడలిలోని వీఆర్‌సీఆర్ బస్ ట్రావెల్స్‌లో క్యాషియర్‌గా పనిచేస్తున్నాడు. ఇతను కడప నబీకోటలో నివాసం ఉంటున్న కొప్పర్తి మోహన్‌రెడ్డి వద్ద ఏడాదిన్నర క్రితం తన అవసరాలకు గాను రూ.1.60 లక్షలు వడ్డీకి తీసుకున్నాడు. ఈ బాకీకి సంబంధించి ప్రతిరోజూ ఫోన్‌పే ద్వారా రూ.6.80 లక్షలు వసూలు చేశాడు. ఇంకా తనకు డబ్బులు బాకీ ఉన్నాడని జూలై 31న సాయంత్రం సమయంలో ఏడురోడ్ల కూడలి సమీపంలో ఉన్న వీఆర్‌సీఆర్ బస్ ట్రావెల్స్ ఆఫీసు దగ్గరికి వెళ్లి శివనాథరెడ్డిని పిలిచి చొక్కా పట్టుకుని దుర్భాషలాడాడు. దీంతో శివనాథరెడ్డి అవమానం భరించలేకపోయాడు. ఈ క్రమంలో మృతుని భార్య గంగాదేవి కొప్పర్తిలోని అథ్లెక్సన్ సీసీ కెమెరాల తయారీ కేంద్రంలో పనిచేస్తుండగా ఆమెను ప్రతిరోజూ మాదిరిగానే గురువారం వదిలి పెట్టి వచ్చాడు. పిల్లలు కూడా స్కూలుకు వెళ్లడంతో గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం సమయంలోపు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడ్డా డు. పిల్లలు పాఠశాలనుంచి గురువారం సాయంత్రం రాగానే ఇంటిలోపల గడియ ఉంచడంతో ఎంత పిలిచినా పలకకపోవడంతో చుట్టప క్కల వారికి విషయం తెలిపారు. వారు తలుపు గడియను పగలగొట్టి చూడగా అప్పటికే శివనాథరెడ్డి ఉరివేసుకుని మృతి చెందాడు. ఈ విషయం భార్యకు తెలపడంతో బోరున విలపించారు. మృతదేహాన్ని శుక్రవారం రిమ్స్ మార్చురీకి తలరించారు. మృతుని భార్య బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


శివనాథరెడ్డి (ఫైల్ ఫొటో)

భార్య పిల్లలకు న్యాయం జరిగేదాకా పోరాటం

శివనాథరెడ్డిపై ఫైనాన్షియర్ కొప్పర్తి మోహన్‌రెడ్డి ఏడురోడ్ల కూడలి సమీపంలో చొక్కా పట్టుకుని దాడి చేశాడని.. ఈ అవమానం తట్టుకోలేకనే ఆత్మహత్యకు పాల్పడ్డాడని చెన్నూరు మండలం ఉప్పరపల్లె ఎంపీటీసీ నిరంజన్‌రెడ్డి, బంధువులు ఆరోపించారు. తీసుకుంది రూ.1.60 లక్షలకు అధిక వడ్డీతో డబ్బులు చెల్లించారని.. మృతుడి ఫోన్‌పేల ద్వారా చెల్లించిన డబ్బులు మాత్రమే దాదాపు రూ.6.80 లక్షలు ఉంటుందని, అయినా ఇంకా డబ్బుల కోసం వేధించి శివనాథరెడ్డి బలవన్మరణానికి కారణమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు.


ఆత్మహత్యకు పాల్పడ్డ శివనాథరెడ్డి


రిమ్స్ మార్చురీ వద్ద మృతుడి బంధువులు

వైవీయూ, నీటిపారుదలశాఖ ఎంవోయూ


ఎంవోయూలను మార్చుకుంటున్న నీటిపారుదలశాఖ, వైవీయూ ప్రతినిధులు

కడప (ఎర్రముక్కపల్లె), ఆగస్టు 2: వైవీయూ ఎర్త్‌సైన్స్ విభాగాన్ని యోగివేమన సాంకేతిక కళాశాల సివిల్ ఇంజనీరింగ్ విభాగంతో కడప ప్రభుత్వ నీటిపారుదలశాఖ మధ్య పరస్పర అవగాహన ఒప్పందం కుదిరింది. శుక్రవారం యూనివర్శిటీలో వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్టారెడ్డి సమక్షంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రఘునాధరెడ్డి, కడప నీటిపారుదలశాఖ చీఫ్ ఇంజనీరు ఎస్.మల్లిఖార్జునరెడ్డి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి వాటిని పరస్పరం మార్చుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆధునిక జియో స్పేషియల్ సాంకేతిక వనరులు, మానవ వనరుల పరస్పర వినియోగం చేసుకోవడానికి అంగీకరించారు. నీటిపారుదలశాఖ వాటికి కావాలసిన జియో స్పేషియల్ మోడలింగ్ డ్యామ్‌లు, కాల్వల అలైన్‌మెంటు నిర్ధారణకు కావాలసిన విధానంపై అవగాహన, సాంకేతిక శిక్షణల ద్వారా సేవలను ఆధునిక సాంకేతికతను వినియోగించడంలో వైవీయూ ఎర్త్‌సైన్స్ సహకరిస్తుంది. కార్యక్రమంలో నీటిపారుదలశాఖ ఎస్ఈ శారద, డి.వెంకట రామయ్య, ఈఈలు రమేశ్, డీఈ అబీదుల్లా, వైవీయూ సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసరు జయరామిరెడ్డి, ఎర్త్‌సైన్స్ అసోసియేట్ ప్రొఫెసరు లక్ష్మిప్రసాద్ పాల్గొన్నారు.

వైఎస్ఆర్‌ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్‌గా ప్రొఫెసరు జయరామిరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), ఆగస్టు 2: ప్రొద్దుటూరు వైవీయూ డాక్టర్ వైఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్‌గా ప్రొఫెసరు జయరామిరెడ్డిని నియమించారు. శుక్రవారం వైవీయూలో వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్టారెడ్డి నియామక పత్రాన్ని రిజిస్ట్రారు ప్రొఫెసరు రఘునాధరెడ్డితో కలిసి జయరామిరెడ్డికి అందించారు. ఇది వరకు ఈ స్థానంలో పనిచేసిన ప్రొఫెసరు నాగరాజు పదవీ కాలం పూర్తవడంతో నూతన నియామకం చేపట్టారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రస్తుత ప్రిన్సిపల్ నాగరాజు, డీన్ రమణయ్య, ప్రొఫెసరు జయచంద్రారెడ్డి, ప్రొఫెసరు నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీపీపీలో క్రేన్ కిందపడి కాంట్రాక్ట్ కార్మికుడు మృతి



మృతి చెందిన కాంట్రాక్ట్ కార్మికుడు, అక్బర్ బాషా ఫైల్‌ఫొటో

ఎర్రగుంట్ల, ఆగస్టు 2: ఆర్టీపీపీలో స్టేజ్ 4 యాష్ ప్లాంటులో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్న అక్బర్ బాషా(50) ప్రమాదవశాత్తు క్రేన్‌కింద పడి శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. అక్బర్ బాషా విధి నిర్వహణలో ఉండగా.. అక్కడే ఉన్న క్రేన్‌డ్రైవర్ లోడింగ్ చేసి హారన్ కొట్టకుండా రివర్స్ రావడంతో వెనుక టైర్లు కిందపడ్డాడు. దీంతో అక్బర్ బాషాకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కార్మికులు ప్రాజెక్టు ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మెరుగైన వైద్యం కోసం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. కలమల్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు.

63 ఎర్రచందనం దుంగలు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న దుంగలను చూపుతున్న ఫారెస్టు అధికారులు


మైదుకూరు రూరల్ ఆగస్టు 2: మండలంలోని వనిపెంట అటవీశాఖ అధికారులు శుక్రవారం 63 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొని.. ముగ్గురు స్మగ్లర్లను అరెస్టు చేశారు. జిల్లా ఫారెస్టు అధికారి పీవీ సందీప్‌రెడ్డి ఆదేశాల మేరకు వనిపెంట ఫారెస్ట్ అధికారి ప్రణీత్‌రావు నల్లమల అడవుల్లో తనిఖీలు చేపట్టారు. ఎర్రచందనం దుంగలను అక్రమంగా తరలిస్తుండగా.. వారిని వెంబడించి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన వారి కోసం గాలింపు చేపడుతున్నట్లు రేంజర్ తెలిపారు. అదుపులో ఉన్న వారి వివరాలను గోప్యం ఉంచారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

- భర్త వేధింపులతోనే... బాధితుల ఆరోపణ

జమ్మలమడుగు, ఆగస్టు 2: పెద్దముడియం మండలం కొండాపాపాయపల్లె గ్రామానికి చెందిన గోనా ఎలిజబెత్‌రాణి (23) అనే వివాహిత శుక్రవారం కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి బంధువుల వివరాల మేరకు.. మైలవరం మండలం బూబూసానిపల్లెకు చెందిన ఎలిజబెత్‌రాణిని పెద్దముడియం మండలం కొండాపాయపల్లె గ్రామానికి మూడేళ్ల క్రితం కె.సామేలు అనే వ్యక్తికి వివాహం జరిపించారు. ఆరోజు కట్న కానుకల కింద 8 తులాల బంగారు, లక్ష రూపాయల నగదు ఇచ్చారు. అప్పటి నుంచి భర్త అప్పుడప్పుడు అదనపు కట్నం కోసం వేధించేవాడు. దీంతో రెండు నెలలుగా మృతురాలు బూబూసానిపల్లెలో ఉండేది. గత నెల 19వ తేదీ ఎలిజబెత్‌రాణిని భర్త సామేలు పిలుచుకుని వెళ్లాడు. 22వ తేదీ రాత్రి ఇంటికి ఫోన్ చేసి మీ కూతురు ఆరోగ్యం బాగోలేదని తెలిపాడు. దీంతో తాము 23వ తేదీ వెళ్లగా అప్పటికే ఏమి జరిగిందో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. అక్కడి నుంచి స్థానిక కాంబెల్ వైద్యశాలకు.. మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించారు. రిమ్స్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. జరిగిన సంఘటనపై పెద్దముడియం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

134 మద్యం బాటిళ్లు స్వాధీనం



జమ్మలమడుగు, ఆగస్టు 2: పట్టణంలో పెద్దపసుపుల రోడ్డులో శుక్రవారం తనిఖీలు చేపట్టి 134 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈబీ కడప స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి శ్రీనివాస నాయుడు తెలిపారు. జమ్మలమడుగు, ప్రొద్దుటూరు ప్రాంతాలకు కారులో హర్యానా లిక్కర్ తరలిపోతోందని సమాచారం మేరకు జమ్మలమడుగులోని బైపాస్ రోడ్డులో తనిఖీలు చేపట్టి.. కారులో ఉన్న 134 హర్యానా లిక్కర్ సీసాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కొమ్మా వినయ్‌కుమార్‌రెడ్డి, చాయసాయిక, షేక్ ఖాజా అనే ముగ్గురుని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. జమ్మలమడుగు ఎస్ఈబీ స్టేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మూడు దుకాణాల్లో చోరీ

కడప (క్రైం), ఆగస్టు 2 : కడప నగరంలోని రాజీవ్‌మార్గ్‌లో సోనోవిజన్ ఎదురుగా ఉన్న దుకాణాల సముదాయాల్లో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. సెలూన్‌షాపు, చిల్లర అంగడి, సిమెంటు అంగళ్లలోకి పైకప్పులను తొలగించి దుండగులు చొరబడ్డారు. మూడు దుకాణాల్లో మొత్తం రూ.25వేల నుంచి రూ.30వేల రూపాయలు చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఏఆర్ సిబ్బంది సంక్షేమంపై ప్రత్యేక దృష్టి : ఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, పాల్గొన్న సిబ్బంది

కడప (క్రైం), ఆగస్టు 2: ఏఆర్ సిబ్బంది సంక్షేమంపై ఎస్పీ హర్షవర్ధన్ రాజు ప్రత్యేక దృష్టి సారించారు. శుక్రవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ పోలీసుకాన్ఫరెన్స్ హాలులో ఏఆర్ సిబ్బందికి దర్బార్ పరేడ్ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లా డుతూ ఏఆర్ సిబ్బంది సంక్షేమానికి తక్షణం చర్యలు తీసుకోవాలని ఏఆర్ అదనపు ఎస్పీ క్రిష్టారావును ఆదేశించారు. గార్డు రూముల్లో మరింత మెరుగైన వసతులు కల్పించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఏఆర్ సిబ్బంది పిల్లల ఉన్నత విద్యావకాశాలపై విద్యారంగంలో నిపుణులతో కౌన్సెలింగ్ నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బయటిప్రాంతాల్లో బందోబస్తు విధులకు వెళ్లే సిబ్బందికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. సమస్యలుంటే నేరుగా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. నిరంతరం విధుల్లో ఉండే సిబ్బంది విరామ సమయాన్ని సద్వినియోగం చేసుకుని కుటుంబ సభ్యులతో గడపాలని సూచించారు. యోగా, ధ్యానం, వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యవంతులుగా మరింత ఉత్సాహంతో విధులు నిర్వర్తించవచ్చన్నారు. రాష్ట్రంలో జిల్లా ఏఆర్‌ను ప్రత్యేక స్థానంలో నిలపాలని ఎస్పీ ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్ఎస్ఎస్‌వీ క్రిష్టారావు, ఏఆర్ డీఎస్పీ మురళీధర్, ఏవో జ్యోతి, ఆర్ఐలు ఆనంద్, శ్రీశైలరెడ్డి, వీరేశ్, టైటాస్, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, ఆర్ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలపై దాడులకు పాల్పడితే చర్యలు : మంత్రి

రాయచోటి (కలెక్టరేట్), అగస్టు 2: జిల్లాలో ఎస్సీ, ఎస్టీలపై అన్యాయంగా దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లో సాంఘిక సంక్షేమ శాఖ అధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా నిఘా మరియు పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. మంత్రి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలపై దాడులు జరగకుండా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అణగారిన వర్గాల హక్కులను కాపాడేవిధంగా కమిటీ సభ్యులు పనిచేయాలన్నారు. నియోజకవర్గాల వారీగా ఎస్సీ, ఎస్టీల గ్రామాల వివరాలు సేకరించి అక్కడ జరుగుతున్న అన్యాయాలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎస్సీ ఎస్టీ కేసులలో బాధితులకు న్యాయంతో పాటు త్వరితగతిన పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. గ్రామలలో ఎస్సీలకు సంబంధించి భూముల సమస్యలుంటే వాటిని సత్వరమే పరిష్కరించాలని కమిటీ సభ్యలను కోరారు. జిల్లాలో అన్ని సాంఘీక సంక్షేమ హస్టళ్లపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని, పోక్సో చట్టం, బాల్యవివాహాలు నిరోధక చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సదస్సులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని పోలీసు, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పోలీసు, రెవెన్యూ విభాగాలు సమన్వయంతో పనిచేసి ఎస్సీ, ఎస్టీ వర్గాలపై నమోదైన కేసుల్లో జాప్యాన్ని నివారించి.. సత్వర న్యాయం అందించాలన్నారు. కార్యక్రమంలో రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, జాయింట్ కలెక్టర్, మదనపల్లి, రాజంపేట, సబ్ కలెక్టర్లు, మేఘస్వరూప్, నదియాదేవి, డీఆర్‌ఓ సత్యనారాయణ, రంగస్వామి, డీఎస్పీలు, సాంఘిక సంక్షేమశాఖ అధికారి రామ సుబ్బయ్య, నిఘా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్నా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్

మంగంపేట పునరాస కాలనీలను పరిశీలించిన సబ్‌కలెక్టర్


పునరావాస కాలనీలో పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ నిదియాదేవి

ఓబులవారిపల్లె, ఆగస్టు 2: ఏపీఎండీసీ డేంజర్‌జోన్ గ్రామాల తరలింపు కోసం సుమారు రూ.100 కోట్లతో కొత్తగా నిర్మిస్తున్న పునరావాసకాలనీని సబ్‌కలెక్టర్ నిదియాదేవి పరిశీలించారు. ఆమె అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. సర్పంచ్ సుధాకర్ పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. అన్నింటినీ పరిశీలించి మంగంపేట వాసులకు న్యాయం చేస్తామని తెలిపారు. సీపీఓ సుదర్శన్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దారు పీర్ మున్నీ, ఆర్ఐ రామ్మోహన్, ఎంపీడీవో కుళ్లా యిస్వామి, ఏపీఎండీసీ అధికారులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

కడప (క్రైం), ఆగస్టు 2: కడప నగరం పాత బైపాస్ వద్ద గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు చిన్నచౌకు సీఐ నరసింహారెడ్డి తెలిపారు. మైదుకూరు మండలం గడ్డంవారిపల్లెకు చెందిన సారక నరసింహులు ప్రస్తుతం ముత్తరాసుపల్లెలో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం ఎస్ఐ రవికుమార్‌తో కలిసి పాత బైపాస్ వద్ద తనిఖీ చేసి అతన్ని అరెస్టు చేసి.. రెండు కేజీల గంజాయితో పాటు బైకు, సెల్ రూ.500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

పరుపుల అంగడిలో అగ్నిప్రమాదం



ప్రొద్దుటూరు క్రైం, అగస్టు 2: పట్టణంలోని జమ్మలమడుగు రోడ్డులో గల అక్షయ పరుపుల అంగడిలో శుక్రవారం అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో 10క్వింటాళ్ల పత్తి కాలిపోయి రూ.50వేలు నష్టం సంభవించినట్లు అగ్నిమాపక అధికారి రఘునాధ తెలిపారు.

రైతాంగ సమస్యల పరిష్కారం కోసం 5న రాష్ట్ర వ్యాప్త ఆందోళన

- ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరయ్య


రాయచోటిటౌన్, ఆగస్టు 2: రాష్ట్ర ప్రభుత్వం బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ముందు కృష్ణానదీ జలాల పునఃపంపిణీ ద్వారా మన రాష్ట్ర నీటి హక్కులను కాపాడాల్సిన సమయం ఆసన్నమైందని, ఆగస్టు 5న రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఏపీ రైతు సంఘం అధ్వర్యంలో తలపెట్టిన రాష్ట్ర వ్యాప్త ఆందోళనలను విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు గుజ్జుల ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన రాయచోటి సీపీఐ కార్యాలయంలో జరిగిన సీపీఐ, రైతు సంఘం నాయకుల సమావేశంలో మాట్లాడుతూ ఆగస్టు 2వ వారం లోపు రాష్ట్ర ప్రభుత్వం తమ వాదనలతో కూడిన నివేదికను ఇవ్వాలని బ్రిజేష్‌కమార్ ట్రిబ్యునల్ కోరిందన్నారు. ఇప్పటికే రెండు, మూడు పర్యాయాలు గత ప్రభుత్వ హయాంలో ట్రిబ్యునల్ ఈ మేరకు ఆదేశించినా పట్టించుకోలేదన్నారు. కేంద్ర ప్రభుత్వంలోని జలశక్తి విభాగం వారు గత ఏడాది అక్టోబరు 6వ తేదీ భారత ప్రభుత్వం ద్వారా గజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. మన రాష్ట్ర ప్రభుత్వం కృష్ణా, గోదావరి నదుల నుంచి తమకు కేటాయించిన, కేటాయించాల్సిన నీటిని సమగ్రంగా విశ్లేషించి బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ ముందు మన వాదనలు వినిపించా లన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రైతాంగ సమస్యలపై పంటలకు గిట్టుబాటు ధర, సాగు, తాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలనే అంశంపై చర్చించేందుకు రాజకీయ పార్టీలు, రైతు సంఘాలు, సాగునీటి రంగ నిపుణులతో సమావేశం నిర్వహించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు, సహాయ కార్యదర్శి మహేశ్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రంగారెడ్డి పాల్గొన్నారు.

స్కూలు కాంప్లెక్స్ సమావేశం మార్చాలి

కడప (ఎర్రముక్కపల్లె), ఆగస్టు 2 : రాష్ట్ర ఎస్ఈఆర్టీ విడుదల చేసిన అకడమిక్ క్యాలెండరులో ఆగస్టు 16, 17 తేదీల్లో స్కూలు కాంప్లెక్స్ సమావేశాలు ఉంటాయని షెడ్యూలులో ఉందని... దాన్ని వెంటనే మార్చాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సీవీ ప్రసాద్, చెంగల్‌రెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. 16న వరలక్ష్మి వ్రతం ఆప్షనల్ లీవ్ కావున కాంప్లెక్స్ సమావేశాలు మార్పు చేయా లని కోరారు.

రేపు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు

కడప (ఎర్రముక్కపల్లె), ఆగస్టు 2 : స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని కడప బాలోత్సవ ఆధ్వర్యంలో ఈనెల 4న ఆదివారం ఎస్వీ ఇంజనీరింగ్ కాలేజీలో చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహి స్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారిణి అనురాధ తెలిపారు. శుక్రవారం డీఈవో కార్యాలయంలో ఆమె పోస్టరును విడుదల చేశారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించే దుకు ఈ పోటీలు తోడ్పడుతాయన్నారు. కడప బాలోత్సవ అధ్యక్షుడు గోపాల్, ప్రతినిధులు పాల్గొన్నారు.



చెన్నూరు తహసీల్దారుగా జీవన్ చంద్రశేఖర్


బాధ్యతలు స్వీకరించిన జీవన్ చంద్రశేఖర్

చెన్నూరు, ఆగస్టు 2 : చెన్నూరు మండల తహసీల్దారుగా జీవన్ చంద్రశేఖర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కర్నూలు జిల్లా బేతంచెర్లలో ఎన్నికల విధుల్లో భాగంగా తహసీల్దారుగా పనిచేసిన ఆయన బదిలీపై చెన్నూరు మండలానికి వచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలు లేకుండా పరిష్కరిస్తా మన్నారు. అలాగే రికార్డుల పరిశీలనలో కానీ, సర్టిఫికెట్ల జారీ విషయంలో కానీ ఎలాంటి ఆలస్యం ఉండదన్నారు. దళారులను ఆశించ వద్దని, అధికారులు ప్రజా సేవ కోసమే ఉన్నారని, సమస్యలు తెలిపి పరిష్కారం పొందాలన్నారు.

సింహాద్రిపురం తహసీల్దార్‌గా గురప్ప


బాధ్యతలు చేపట్టిన గురప్ప

సింహాద్రిపురం, ఆగస్టు 2: సింహాద్రిపురం తహసీల్దార్‌గా బి. గురప్ప శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన నంద్యాల జిల్లా నుంచి బదిలీపై సింహాద్రిపురం వచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ తమ కార్యాలయ సిబ్బంది, ప్రజల సహకారంతో సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామన్నారు.

'విద్యావ్యవస్థలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి'

కడప (ఎర్రముక్కపల్లె), ఆగస్టు 2: రాష్ట్రవ్యాప్తంగా పాఠశాల విద్యావ్యవస్థలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్లిఖార్జున డిమాండ్ చేశారు. శుక్రవారం డీఈఓ కార్యాలయంలో డీఈఓ అనురాధకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీఓ 1ను పటిష్ఠంగా అమలు చేయాలని కోరారు. ఇంతవరకు పూర్తి స్థాయిలో పుస్తకాలు పంపిణీ కాలేదన్నారు. తక్షణం పుస్తకాలు పంపిణీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వీటితో పాటు మరికొన్ని సమస్యలు డీఈఓ దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు చందునాయక్, ప్రశాంత్ పలువురు పాల్గొన్నారు.

పింగళి వెంకయ్యకు ఘన నివాళి

పులివెందుల, ఆగస్టు 2:భారత జాతీయ త్రివర్ణ పతాకం రూపొందించిన పింగళి వెంకయ్యకు ఘన నివాళులు అర్పించారు.స్థానిక పులివెందుల సహకార కేంద్ర బ్యాంకు నందు పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా కడప జిల్లా సహకార కేంద్రం బబ్యాంకు స్పెషల్ క్యాడర్ డిప్యూటీ రిజిస్ట్రార్/ప్రత్యేక విధుల అధికారి గుర్రప్ప ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

'జీఓ 77ను రద్దు చేయాలి'

కడప (ఎర్రముక్కపల్లె), ఆగస్టు 2 : పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేస్తున్న జీఓ 77ను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలని సీఆర్‌ఎస్‌వైఎఫ్ రాష్ట్ర కన్వీనరు శంకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం కడప నగరం సీఆర్‌ఎస్ వైఎఫ్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం 2020 డిసెంబరులో ప్రైవేటు యూనివర్సిటీలు, పీజీ సెంటర్లు ఇంజనీరింగ్ కళాశాలలు, ఎయిడెడ్ కళాశాలల్లో పీజీ, ఎంబీఏ, ఎంసీఏ టెక్నికల్ కోర్సులు చేసేవారికి ఫీజు రీయింబర్స్‌మెంటు ఇవ్వబోమని జీఓ 77ను విడుదల చేసిందన్నారు. ఈ జీఓ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా వేల మంది విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువగళం పాదయాత్రలో ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, అలాగే సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ అధికారంలోకి వస్తే జీఓ 77ను రద్దు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు.

'ఆ ఎమ్మార్వో కమలాపురానికి అవసరం లేదు'

కడప (మారుతీనగర్), ఆగస్టు 2: కడప ఎమ్మార్వోగా గతంలో పనిచేసిన శివరామిరెడ్డి సేవలు కమలాపురానికి అవసరం లేదని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బారెడ్డి శుక్రవారం విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. కడపలో పనిచేసిన ప్పుడు వైసీపీ తొత్తుగా వ్యవహరిస్తూ మాజీ డిప్యూటీ సీఎంకు ప్రభుత్వ స్థలాలను దోచిపెట్టారన్నారు. అలాంటి వ్యక్తిని తిరిగి కమలాపురం ఎమ్మార్వోగా ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడం సరైంది కాదని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

వరుణదేవా... కరుణించు

● వర్షాభావంతో ఎండుతున్న పంటలు ● ఆందోళనలో రైతులు


ఉరుటూరులో వర్షాభావంతో దెబ్బతిన్న మినుము... ఎస్.పాలగిరిలో ఎండుదశలో వేరుశనగ

వీరపునాయునిపల్లె, ఆగస్టు 2 : వాన లేక రైతులు ఇబ్బందిపడుతున్నారు. పైరు సాగుచేసి చాలా రోజులు అయినా పదును వర్షం కురవక పోవడంతో ఆ పైరు ఎండిపోతోంది. దీంతో ఆందోళన చెందుతు న్నారు. వీరపునాయునిపల్లె మండలంలో దుస్థితి ఇదీ... ఖరీఫ్ సీజన్‌లో అరకొరగా సాగుచేసిన పంటలు వర్షాభావంతో ఎండుదశకు చేరుకున్నాయి. జూన్, జూలై మాసాలలో కురిసిన వర్షాలతో రైతులు అష్టకష్టాలు పడి పొలాలను చదును చేసి దుక్కులు దున్ని పంటల సాగుకోసం అప్పులు తెచ్చి పైరు సాగు చేశారు. ఈ సీజన్‌లో వ్యవసాయ పొలాల్లో మినుము, వేరుశనగ తదితర పంటలు వేశారు. సాగుచేసి రెండునెలలు గడుస్తున్నా ఇంతవరకు వర్షం కురవకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నామని, పంటలు ఎండుదశకు చేరుకుంటున్నాయని, తమ గోడును ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల వ్యాప్తంగా ఎస్.పాలగిరి, వీరపునాయునిపల్లె, అనిమెల, ఎస్.పాలగిరి, ఉరుటూరు, తలపనూరు, కొమ్మద్ది తదితర గ్రామాలలో ఈ పంటలను సాగుచేశారు. తీరా చూస్తే వరుణుడు కరుణించకపోవడంతో పంటలు పూర్తిగా ఎండుదశకు చేరాయని, అంతేకాకుండా పంట పూర్తిగా పనికిరాకుండా పోతోందని తెలిపారు. పెట్టిన పెట్టుబడులు కూడా దక్కవని రైతులు అంటున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వర్షాభావంతో ఎండుతున్న పంటలను పరిశీలించి రైతులకు జరిగిన నష్టాన్ని నివేదికల ద్వారా ప్రభుత్వానికి అందజేసి పరిహారం మంజూరయ్యేలా చూడాలని బాధిత రైతులు కోరుతున్నారు.

రూ.80వేలు ఖర్చు చేశా

నాకున్న పొలంలో వేరుశనగ పంట సాగుచేశాను. దాదాపు రూ.80వేలు దాకా ఖర్చుచేశాను. మొలక దశలోనే వర్షాభావంతో ఎండిపోయింది. పశువులకు కూడా పనికిరాకుండా పోయింది. వ్యవసాయమే మాకు జీవనాధారం. వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలి. - సి.వెంకటసుబ్బయ్య, ఎస్.పాలగిరి, వీరపునాయునిపల్లె మండలం

వెంటనే నష్ట పరిహారం అందించాలి



నేను ఏడు ఎకరాల్లో మినుము పంట సాగు చేశాను. వర్షాభావం కారణంగా రూ. 70వేలు నష్టపోయాను. గుత్త కింద రూ.50వేలు చెల్లించాలి. అధికారులు దెబ్బతిన్న పంటలలను పరిశీలించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి. రైతులను ఆదుకోవాలి.

- శ్రీరంగడు, కౌలు రైతు, ఉరుటూరు, వీరపునాయునిపల్లె మండలం

చౌడేశ్వరికి ఘనంగా చీర, సారె


అమ్మవారికి చీర, సారె తీసుకెళుతున్న మహిళలు.. (ఇన్‌సెట్) ప్రత్యేక అలంకరణలో రామలింగ చౌడేశ్వరిదేవి

చెన్నూరు, ఆగస్టు 2 : చెన్నూరు రామలింగ చౌడేశ్వరిదేవి 95వ జయంతి సందర్భంగా చెన్నూరు ప్రజలు అమ్మవారికి చీర, సారె సమర్పించారు. ప్రతి యేటా ఆషాడ అమావాస్య రోజున అమ్మవారి జయంతి నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది, మూడు రోజులపాటు నిర్వహించే ఈ జయంతి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం చెన్నూరు సరస్వతీనగర్‌లోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేసి అక్కడ నుంచి మహిళలు అమ్మవారికి చీర, సారె సమర్పించేందుకు పెద్దసంఖ్యలో హాజరై పూలు, పండ్లు, గాజులు, కుంకుమ, పసుపు చీరలు తదితర పవిత్ర వస్తువులను పూజించి సాంప్రదాయ బద్ధంగా తలపై ఉంచుకుని మంగళవాయిద్యాలతో చౌడేశ్వరి ఆలయానికి చేరుకున్నారు. అప్పటికే అమ్మవారికి తెల్లవారుజాము నుంచి అభిషేకాలు, ప్రత్యేక పూజ అలంకరణలు చేశారు.

అలాగే మహిళలు తీసుకువచ్చిన చీరసారెను అమ్మవారికి సమర్పిం చారు. ఈ సందర్భంగా మండల వ్యాప్తంగా అధిక సంఖ్యలో మహిళలు అమ్మవారి దర్శనం కోసం అందునా ఆషాడమాస ఆఖరి శుక్రవారం కావున చౌడేశ్వరని దర్శించుకునేందుకు తరలివచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి చీర, సారె సమర్పించిన సమయంలో కేరళ నుంచి వచ్చిన ప్రత్యేక వాయిద్య కళాకారుల బృందం మంగళవాయిద్యాలు నిర్వహిం చారు. వివిధ రకాల వేషాలు ఈ కార్యక్రమంలో నిర్వహించారు. అనంతరం వచ్చిన ప్రజలకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు అందించారు.

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి: డీఎస్పీ


డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన బుక్కే మురళి

పులివెందుల టౌన్, ఆగస్టు 2: పులివెందుల డీఎస్పీగా బుక్కే మురళి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వ బదిలీల్లో భాగంగా చిత్తూరు జిల్లా కళ్యాణి డ్యాం పీటీసీలో పనిచేస్తున్న మురళి పులివెందులకు బదిలీ అయ్యారు. 1996లో ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించి కర్నూలు, కడప జిల్లాలో వివిధ పోలీస్‌స్టేషన్‌లలో పనిచేశారు. ఎస్ఐ నుంచి సీఐగా ప్రమోషనం పొంది కోవెలకుంట్ల స్టేషన్‌కు సీఐగా వెళ్లారు. కడప, అన్నమయ్య జిల్లాలోని పోరుమామిళ్ల, కడప క్రైం బ్రాంచ్, జమ్మలమడుగు, రాజంపేటలో సీఐగా పనిచేశారు. డీఎస్పీగా ప్రమోషన్ పొంది కళ్యాణి డ్యాం పీటీసీకి బదిలీ అయ్యారు. అక్కడి నుంచి పులివెందులకు వచ్చారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలప్రై పత్యేక దృష్టి సారిస్తామన్నారు.

అంజన్నను దర్శించుకున్న డీఎస్పీ

చక్రాయపేట, ఆగస్టు 2: ప్రముఖ గండిక్షేత్రంలో వెలసిన శ్రీవీరాంజనేయస్వామిని పులివెందుల నూతన డీఎస్పీ బుక్కే మురళి శుక్రవారం దర్శించుకున్నారు. ప్రధాన అర్చకులు కేసరి ఆయనకు స్వాగతం పలికి పూజలు చేయించారు. ఆలయ విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. ఆయన పలువురు పోలీసులు ఉన్నారు.

వైవీయూ ఏబీవీపీ అధ్యక్ష, కార్యదర్శులుగా అనీస్, ప్రేమ్‌సాగర్

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 2 : వైవీయు ఏబీవీపీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా అనీస్‌బాబు, ప్రేమ్‌సాగర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం వైవీయులో ఏబీవీపీ యూనివర్శిటీ నూతన కమిటీ ఎంపిక నిర్వహించారు. ఈ సందర్భంగా హనీఫ్, ప్రేమ్‌సాగర్‌లు మాట్లాడుతూ తమపై నమ్మకంతో బాధ్యత ఇచ్చిన జిల్లా, రాష్ట్ర కమిటీలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కోడూరు మల్లిఖార్జున మాట్లాడుతూ దేశంలో ఏబీవీపీ 75సంవత్సరాల నుండి విద్యారంగ సమస్యల కోసం పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్శిటీ డెవలప్‌మెంటు కన్వీనరుగా అనిల్, కళామంచ్ కన్వీనరుగా ముత్యం, సభ్యులుగా అశోక్, రవి, పవన్‌లు ఎంపికయ్యారు.

బ్రాహ్మణపల్లెలో ఇసుక డంప్ సీజ్

పులివెందుల టౌన్, జూలై 2: పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లెలో ఇసుక డంప్‌ను సీజ్‌చేశారు. గురువారం అర్ధరాత్రి అమరావతి, పులివెందుల సెబ్, రెవెన్యూ అధికారులు కలిసి భారీ ఇసుక డంప్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఈబీ అధికారులు తెలిపారు. సీజ్ చేసిన విషయాన్ని గుట్టుగా ఉంచినట్లు తెలుస్తోంది. ఉదయం నుంచి ఎవరికీ సమాచారం ఇవ్వకుండా రహస్యంగా ఉంచడం గమనార్హం. ఇది ఎవరికి సంబంధించినది, దీని వెనుక రాజకీయ హస్తం ఉందా అన్న విషయం తెలియాల్సి ఉంది.

కొత్త భవనంలోకి ఎండోమెంట్ కార్యాలయం

కడప (ఎన్టీఆర్ సర్కిల్), ఆగస్టు 2 : నగరంలోని దేవదాయ శాఖ కార్యాలయాన్ని నూతనంగా నిర్మించిన భవనంలోకి మార్చినట్లు ఆ శాఖ అసిస్టెంటు కమిషనర్ శంకర్ బాలాజీ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇదివరకు నగరంలో ఉన్న కో ఆపరేటివ్ కాలనీలోని నెహ్రూ పార్కు ఎదురుగా ఉన్న భవనం నుంచి రాజంపేట బైపాస్‌లో ఉన్న వార్డు సచివాలయం వద్ద నూతనంగా నిర్మించిన భవనంలోకి మార్చినట్లు ఆయన వివరించారు.

క్రీడలపై యువత శ్రద్ధ చూపాలి

కడప (స్పోర్ట్స్), ఆగస్టు 2:యువత క్రీడలపై శ్రద్ధ చూపాలని సంఘ సేవకుడు సలావుద్దీన్ సూచించారు. ఈ నెల 3, 4 తేదీలలో స్థానిక పోలీస్ మైదానంలో జరగనున్న ధోని ట్రోఫీ-2024 క్రికెట్ కార్యక్రమ షెడ్యూల్ పోస్టర్ లాంచ్ కార్యక్రమం శుక్రవారం స్థానిక ఖానాఫ్ రిస్టా కారాయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మనదేశం గర్వించదగ్గ క్రికెట్ దిగ్గజాలలో భారత జట్టు మాజీ కెప్టెన్ ఎం.ఎస్ ధోనీ ఒకరన్నారు. అ లాంటి స్థాయికి ఎదగడానికి క్రికెట్ పట్ల ఆయనకున్న మక్కువతోనే అనే సంగతి నేటి యువ క్రీడాకారులు గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు.

గిడ్డంగివారిపల్లెలో పనిచేయని ఫైబర్ నెట్

● మూగబోయిన ఫోన్లు, టీవీలు

వేంపల్లె, ఆగస్టు 2: మండలంలోని మారుమూల గ్రామమైన గిడ్డంగివారిపల్లెలో ఫైబర్‌నెట్‌పనిచేయడం లేదు. ఆ గ్రామంలో 75శాతానికి పైగా ఇళ్లలో ఫైబర్‌నెట్ కనెక్షన్ ఉంది. ఫోన్, టీవీ, ఇంటర్నెట్ సౌకర్యం ఉపయోగించుకునే వారు. గత కొద్ది రోజులు ఫైబర్ నెట్‌పనిచేయడం లేదని ఆ గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ముల్లంగి సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఫైబర్ నెట్‌కు సంబంధించిన ఉద్యోగులకు సమాచారం ఇచ్చిన పట్టించుకోవడం లేదని తెలిపారు. స్ట్రైక్‌లో ఉన్నామని చెబుతూ నిర్లక్ష్య సమాధానం ఇస్తున్నారని తెలిపారు. ఫైబర్ నెట్ లేకపోవడంతో గ్రామస్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని, సంబంధిత ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని గ్రామంలో ఫైబర్ నెట్ పనిచేసేలా చూడాలని కోరుతున్నారు.

చిన్నమాచుపల్లె, రామనపల్లె రోడ్డు ఏర్పాటుకు అంచనాలు


చిన్నమాచుపల్లె , రామనపల్లె రోడ్డును పరిశీలిస్తున్న డీఈ మురళి, అధికారులు

చెన్నూరు, ఆగస్టు 2 : మండలంలోని చిన్నమాచుపల్లె, రామనపల్లె మధ్య ఉన్న పంచాయతీ రాజ్ రోడ్డుకు కోటి రూపాయలతో శుక్రవారం అంచనాలు తయారు చేశారు. దాదాపు 2 కి.మీ దూరం ఉన్న ఈ రోడ్డు చాలా ఏళ్లుగా గుంతలుతేలి రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉండేది. కనీస మరమ్మతులు, ప్యాచింగ్ వర్క్ చేయకపోవడంతో నిత్యం అత్యధిక సంఖ్యలో ప్రజలు తిరిగే ఈ దారిలో ఇబ్బందులు ఎక్కువగా ఉండేవి. ముఖ్యంగా వర్షాకాలం, చీకటి వేళల్లో మరింత సమస్యగా ఉండేది. కాగా ఈ విషయం ఆ గ్రామ రాష్ట్ర టీడీపీ నేత ఎల్.రమణారెడ్డి, ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో వారు ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య దృష్టికి తీసుకువెళ్లగా ఆయన రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. ఆ మేరకు అంచనాలు తయారు చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు తెలపడంతో శుక్రవారం డీఈ మురళి, ఏఈ జిలానీబాషా, సైట్‌ఇంజనీరు జయప్రకాశ్ రెడ్డి రోడ్డును పరిశీలించారు. 2 కి.మీ మేర సిమెంటు రోడ్డు వేయాలని నిర్ణయించారు. ఎక్కడ కల్వర్టులు అవసరమో పరిశీలించారు. అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి పంపుతామని ఈ సందర్భంగా డీఈ మురళి పేర్కొన్నారు.

పోషణ, పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి

పెండ్లిమర్రి, ఆగస్టు 2: ఎస్‌హెచ్‌సీ సభ్యులకు పోషణ, పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని ప్రాజెక్టు డైరెక్టర్ ఆనంద్‌నాయక్ సూచించారు. శుక్రవారం మండల సమాఖ్య కార్యాలయంలో ఎఫ్‌ఎన్‌హెచ్‌డబ్ల్యూపై హెల్త్ సబ్‌కమిటీ సభ్యులకు, వీఓఏలకు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణకు పీడీ హాజరై మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

ప్రతి రైతుకూ నష్టపరిహారం అందేలా చూస్తా

● కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి


ఎండిపోయిన మినుము పైరును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి

కమలాపురం రూరల్, ఆగస్టు 2 : పంట నష్టపోయిన ప్రతి రైతుకూ నష్టపరిహారం అందేలా చూస్తానని ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని చదిపిరాళ్ల గ్రామంలో సాయిబాబా దేవాలయ సమీపంలో ఎండిపోయిన మినుము పంటను వ్యవసాయశాఖ జేడీ నాగేశ్వర్‌రావుతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితి వల్ల పంటలు ఎండిపోయాయని, పంట వేసి నష్టపోయిన ప్రతి రైతును ఆదుకునేందుకు కృషి చేస్తామని తెలిపారు. కమలాపురం, వల్లూరు మండలాల్లో ఖరీఫ్ సీజన్‌లో దాదాపు 5వేల ఎకరాల్లో వేసిన మినుము, ఇతర పంటలు ఎండిపోతున్నాయని, ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం జరిగే విధంగా చూస్తామన్నారు. సీఎం చంద్రబాబునాయుడు రైతులకు సహాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. జిల్లా వ్యవసాయధికారి నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ రైతులు ఈ క్రాప్ బుకింగ్ చేసుకోవాలని తెలిపారు. త్వరలో ఆయా ప్రాంతాల్లో వ్యవసాయాధికారులు పర్యటిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఏడీఏ నరసింహారెడ్డి, ఏఓ సరస్వతి, వ్యవసాయ సిబ్బంది టీడీడీ నాయకులు వాసు దేవరెడ్డి, ఖాదర్‌బాషా, కంకర సుబ్బారెడ్డి, దివాకర్‌రెడ్డి, జంపాల నరసింహారెడ్డి, ప్రభాకరరెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలి'


డీఈకి వినతిపత్రం అందిస్తున్న యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ కార్మికులు

కడప (నాగరాజుపేట), ఆగస్టు 2:'విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని యునైటెడ్ ఎలక్ట్రికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.సుదర్శన్ రెడ్డి, యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసుల రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విద్యుత్ భవన్ వద్ద కడప జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్ ఎస్ఈ కార్యాలయంలో టెక్నికల్ డీఈకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ప్రతి కాంట్రాక్టు కార్మికుడినీ రెగ్యులర్ చేయాలన్నారు అరియర్స్ వెంటనే ఇవ్వాలని, కారుణ్య నియామకాలను చేపట్టాలన్నారు. మైదుకూరు డివిజన్‌లో పనిచేసే చరణ్‌కుమార్ అనే షిఫ్ట్ ఆపరేటర్ 11.7.2021లో చనిపోయాడన్నారు. అతని భార్య అయిన ఎ.ఆదిలక్ష్మికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. అలాగే కూలూరు కొట్టాల సబ్ స్టేషన్ ప్రొద్దుటూరు డివిజన్‌లో పనిచేసే ఎంవీ సుబ్బారెడ్డి 11.10. 2020న రోడ్డు ప్రమాదం జరిగి మంచానికే పరిమితమయ్యాడన్నారు. కుటుంబాన్ని పోషించుకోవడానికి అతని భార్య అఖిలకు ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరి, మణికంఠ, మహేశ్వర్‌రెడ్డి రామిరెడ్డి, గంగాధర్‌నాయక్, బాలక్రిష్ణ, హుసేన్, దుగ్గిరెడ్డి, బాబు, రమణారెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠువ్యాధిని సమూలంగా నిర్మూలించవచ్చు


కుష్ఠువ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

వల్లూరు, ఆగస్టు 2:కుష్ఠువ్యాధిని ప్రారంభంలో గుర్తిస్తే సమూలంగా నిర్మూలించవచ్చని జిల్లా కుష్ఠు, ఎయిడ్స్, క్షయ అధికారి డాక్టర్ రవిబాబు పేర్కొన్నారు. శుక్రవారం జాతీయ కుష్ఠువ్యాధి నిర్మూలన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్ఠువ్యాధికి సంబంధించి ఎటువంటి అపోహలు వద్దన్నారు. ఎక్కడో దూరం పోకుండా సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదిస్తే వారిని జాగ్రత్తగా పరిశీలించి వారికి నయమయ్యే మందులు కూడా అందజేస్తామని తెలిపారు. అనంతరం వల్లూరులో ఈ అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం స్థానిక సీహెచ్‌సీలో వైద్యసిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి ఈ వ్యాధుల పట్ల వారికి తగు సలహాలు, సూచనలు ఇచ్చారు. వీరి వెంట ఫిజియోథెరపీ డాక్టర్ మనోహర్, స్థానిక డాక్టర్ లక్ష్మీప్రసన్న, వేణుగోపాల్, సూపర్‌వైజరు సుధాకర్, ఎఎన్ఎంలు శ్రీదేవి, లీలావతి, ఆశా వర్కర్‌లు పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ మాఫియాపై చర్యలు తీసుకోవాలి: ఆర్సీపీ


వినతిపత్రం అందజేస్తున్న రవిశంకర్‌రెడ్డి

కడప (నాగరాజుపేట), ఆగస్టు 2 : బుద్దా రియల్ ఎస్టేట్ మాఫియాపై చర్యలు తీసుకోవాలని ఆర్సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన కడప ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ నాగసుందరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మేనమామ, కమలాపురం మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి ముఖ్య అనుచరుడు గుమ్మా రాజేంద్రనాథరెడ్డి ఆధ్వర్యంలోని బుద్దా ఇన్‌ఫ్రా ప్రైవేటు లిమిటెడ్ వారు అక్రమంగా ప్రభుత్వ భూములను, స్మశానాలను, చెరువులను ఆక్రమించి రూ. లక్షలు కొల్లగొట్టారన్నారు. బుద్దా ఇన్‌ఫ్రా ప్రైవేటు లిమిటెడ్‌పై తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్డీఓ, తహసీల్దారు వాటిని కూల్చివేస్తే కొద్దిరోజులు గడవక ముందే మళ్లీ నిర్మాణాలు చేపట్టారన్నారు. ఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శి సిద్దరామయ్య, ఆర్సీపీ నగర కార్యదర్శి మగ్బుల్ బాషా, మడగలం ప్రసాద్, చాపల సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణతోనే మాదిగల జీవితాల్లో మార్పు'

కడప (మారుతీనగర్), ఆగస్టు 2: ఎస్సీ వర్గీకరణతోనే మాదిగల జీవితాలలో మార్పు వస్తుందని ఏపీ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర నాయకుడు గొడుగునూరు మునెయ్య, జిల్లా అధ్యక్షుడు తప్పెట శివ మాదిగ, నాయకులు మాతంగి సుబ్బరాయుడు, పెద్ద సుబ్బరాయుడు పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా అత్యున్నత న్యాస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ ఏపీ ఎమ్మార్పీఎస్ (పేరుపోగు వెంకటేశ్వరరావువర్గం) ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మహావీర్ సర్కిల్ వద్ద గల దేశ మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించి సంబరాలు జరుపుకున్నారు.

'ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం'

కడప (ఎర్రముక్కపల్లె), ఆగస్టు 2:ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని జైబీం మాలమహాసేన అధ్యక్షుడు పల్లెకొండు సంపత్‌కుమార్ తెలిపారు. శుక్రవారం కడప నగరం మాసాపేట జైబీం మాలమహాసేన కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్సీవర్గీకరణ రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించినది కాదని, ఇది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమన్నారు. 2005 సంవత్సరంలో సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ కొట్టివేసిందని గుర్తు చేశారు. జైబీం మాలమహాసేన కార్యదర్శి చైతల్యతోపాటు పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన తుంగా రమణయ్య


మంత్రి నాదెండ్లతో తుంగా రమణయ్య

కడప (సెవెన్‌రోడ్స్), ఆగస్టు 2 : విజయవాడ జనసేన పార్టీ కార్యాలయంలో కడప నగరానికి చెందిన జనసేన నాయకుడు తుంగా రమణయ్య శుక్రవారం మంత్రి నాదెండ్ల మనోహర్‌ను గౌరవప్రదంగా కలిశారు. ఈ సందర్భంగా తుంగా రమణయ్య మాట్లాడుతూ పార్టీ నిర్ణయం ప్రకారం సభ్యత్వ నమోదు కార్యక్రమం విజయవంతంగా జరుగుతోందని, ఇంకా జరుగుతునే ఉంటుందన్నారు. మిగతా జిల్లాల కంటే కడప జిల్లా అత్యధికంగా సభ్యత్వ నమోదు జరుగుతోందన్నారు. కష్టపడి పనిచేసిన వారిని గుర్తించి తగిన ప్రాధాన్యత కల్పించాలని మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కోరారు.

గతుకుల రోడ్లకు అతుకులు ఎప్పుడో..?

దారుణంగా దర్శనమిస్తున్న రోడ్లు ● అవస్థలు పడుతున్న జనం

పెద్దముడియం, ఆగస్టు 2 : గత ప్రభుత్వ నిర్వాకం కారణంగా గ్రామీణ రహదారులు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. చిరిగిన విస్తరిలా ఛిద్రమైన రోడ్లు, గోతులు పడి కోతకు గురైన రహదారులతో జనం పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు. అడుగడుగునా పాడైన రోడ్లపై ప్రయాణం నరకంగా మారిందని వాహనదారులు గగ్గోలు పెడుతున్నారు. ఇలాంటి దుస్థితిలో పెద్దముడియం మండలంలో చాలా రోడ్లే కనిపిస్తున్నాయి. మండలంలోని అన్నిగ్రామాలకు వెళ్లేరహదారులన్నీ పూర్తిగా దెబ్బతిన్నాయి.

● గుండ్లకుంట- మేడిదిన్నె గ్రామాల మధ్య గురుకుల పాఠశాల సమీపంలో మూడు సంవత్సరాల క్రితం వర్షాల కారణంగా రోడ్డు కోతకు గురైంది. సంవత్సరాలు గడుస్తున్నా ప్రభుత్వయంత్రాంగం తట్టెడు మట్టి పోసిన పాపాన పోలేదు. దీంతో ఈమార్గంలో వెళ్లే వాహనదారులు మరీ ముఖ్యంగా రాత్రి సమయాల్లో బిక్కుబిక్కుమంటూ వెళుతున్నారు.

● చిదిపిరాళ్లదిన్నె- మేడిదిన్నె గ్రామాల మధ్య రహదారిపై పెద్ద గొయ్యి ఏర్పడి ఏడాదికి పైగా గడుస్తున్నా దానిని పూడ్చే నాధుడే లేడు.

● చిన్నముడియం - పాలూరు గ్రామాల మధ్య రహదారి అడుగడుగునా చిరిగిన విస్తరిలా మారి వాహనదారులకు చుక్కలు చూపిస్తోంది.

● పెద్దముడియం - జంగాలపల్లె రోడ్డు ఛిద్రమై ద్విచక్ర వాహనదారులు కూడా వెళ్లలేనంత దారుణంగా తయారైంది.

●ఎన్‌కొట్టాలపల్లె- పెద్దపసుపుల, పెద్దపసుపుల - చలివెందల గ్రామాల మధ్య రోడ్ల పరిస్థితి సరే సరి.

● జంగాలపల్లె - సుద్దపల్లె గ్రామాల మధ్య రోడ్డు దెబ్బతిని అల్లాడిపోతున్నా పట్టించుకునే నాధుడే లేవు.

● జె.కొట్టాలపల్లె- నెమ్మళ్లదిన్నె గ్రామాల మధ్య రోడ్డు కూడాధ్వంసమై జనాలకు నరకం చూపిస్తోంది.

● పాలూరు - నాగరాజుపల్లె గ్రామాల మధ్య రోడ్డుపై పడ్డ గుంతలతో ప్రజలు నానా తంటాలు పడుతూ ప్రయాణం సాగిస్తున్నారు.

● ఎన్‌కొట్టాలపల్లె నుంచి వెల్లాల, ఉలవపల్లె నుంచి ఎన్.కొట్టాలపల్లె, మేడిదిన్నె నుంచి ఎన్.కొట్టాలపల్లె గ్రామాల మధ్య రోడ్డు కూడా పాడైపోయి వాహనదారులు నానా అవస్థలు పడుతు న్నారు. ఇలా మండలంలో అన్ని గ్రామ పంచాయతీల పరిధిలోని ప్రధాన రోడ్లు దెబ్బ తిన్నాయి. ప్రస్తుత ప్రభుత్వమైనా వెంటనే గుంతలను పూడ్చి అవసరమైన మరమ్మ తులు చేపట్టాలని జనాలు వేడుకుంటున్నారు.



చిన్నముడియం -పాలూరు మధ్య ఛిద్రమైన రోడ్డు





మేడిదిన్నె - చిదిపిరాళ్లదిన్నె మధ్య గొయ్యిపడ్డ రహదారి, గుండ్లకుంట- మేడిదిన్నె మధ్య కోతకు గురైన రోడ్డు

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 2: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు సందర్భంగా పార్లమెంటు చట్టం చేసి చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి సుధాకర్‌మాదిగ పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తూ శుక్రవారం పాత బస్టాండు వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మార్పీఎస్ నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు రాజేశ్వరి, రాష్ట్ర మహిళా కార్యదర్శి మద్దులేటమ్మ, రాజేష్, పుల్లయ్య, దాసు, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీవర్గీకరణతో న్యాయం గెలిచింది

బద్వేలు రూరల్, ఆగస్టు 2 : ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ వల్ల న్యాయం గెలిచిందని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు గొడుగునూరు ప్రతాప్, పూలే ఆశయ సాధన కమిటి ఛైర్మన్ గురుమూర్తి అన్నారు. శుక్రవారం ప్రధాని మోదీ, ముఖ్యమంత్రిచంద్రబాబు, డిప్యూటీసీఎం పవన్‌కల్యాణ్, మందక్రిష్ణమాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో జగ్జీవనరామ్ ఆశయ సాధన సమితి కార్యదర్శి రత్నం, టీడీపీ నాయకుడు కొలవలి వేణుగోపాల్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు రంగనాయకులు, గంగిపోగు నరసింహులు, గురయ్య, ప్రసాద్, చిన్నయ్య, ఆవాజ్ కమిటీ కార్యదర్శి రసూల్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం

కొండాపురం, ఆగస్టు 2 : ఎస్సీ వర్గీకరణ రాజ్యంగ విరుద్ధమని కొండాపురం మాలమహానాడు నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం వారు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ సిద్దికకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మనోహర్‌బాబు, జయంతు, చిన్నా, అరుణ్ కార్తీక్, పుల్లయ్య పాల్గొన్నారు.

బద్వేలు..: ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగవిరుద్ధమని, సుప్రీం కోర్టు తీర్పు మాలలకు నష్టదాయకమని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి మీసాల రవి శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. కోర్టు తీర్పుపై జాతీయ స్థాయిలో పోరాడుతామని తీర్పు రివ్యూ చేయాలని పిటీషన్ వేస్తామన్నారు.మాలమహానాడు ఆధ్వర్యంలో వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాడుతామన్నారు.

జమ్మలమడుగు..: ఎస్సీ వర్గీకరణకు సంబంధించి సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తున్నట్లు రాష్ట్ర మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు రామాజీ ఇమ్మానుయేల్, ఆ కమిటీ వారు తెలిపారు. శుక్రవారం జమ్మలమడుగులోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మాలమహానాడు నాయకులు శ్రీనివాసులు, విజయకుమార్, చెన్నయ్య, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను సాధించుకుందాం

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 2: జిల్లాకు కల్పవృక్షం స్టీల్ ప్లాంట్ అని,దానిని సాధించుకోవడానికి ఉద్యమించాలని స్టీల్‌ప్లాంట్ యునైటెడ్ ఫోరం కన్వీనర్ ఎస్.ఎస్.ఖలందర్ పేర్కొన్నారు. శుక్రవారం మూమెంట్‌ఫర్ పీస్ అండ్ జస్టీస్ కార్యాలయంలో కరపత్రం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీజే పట్టణాధ్యక్షుడు హుస్సేన్‌బాషా, జిల్లా అధ్యక్షుడు జాకీర్, షఫి, కుళాయప్ప, ఆయూబ్‌ఖాన్, సలీం తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో యువతకు ప్రాధాన్యం

ప్రొద్దుటూరు, ఆగస్టు 2 : జనసేనలో యువతకు ఎక్కువగా ప్రాధాన్యత కల్పిస్తుందని ఆపార్టీ నియోజకవర్గ ప్రతినిధి అక్కిదాసరి రామారావు తెలిపారు. శుక్రవారం స్థానిక విజయ్‌కుమార్ సర్కిల్లో జనసేన పార్టీ 4వ విడత సభ్యత్వ నమోదు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యువత స్వచ్ఛందంగా జనసేనలో చేరుతున్నారని రామారావు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నేతలు జిలాన్‌బాషా,ప్రసాద్, రామాజీ, శివకళ్యాణ్‌రెడ్డి, సంజీవరాయుడు, లక్షుమయ్య, విజయ్ కళ్యాణ్, సుధీర్ రంగస్వామి పాల్గొన్నారు.

రేపు చౌడేశ్వరీదేవి జన్మదిన మహోత్సవం

జమ్మలమడుగు, ఆగస్టు 2: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని చౌడేశ్వరీదేవి ఆలయం ముస్తాబవుతోంది. ఈనెల 4వ తేదీ నాగులకట్ట వీధిలో చౌడేశ్వరీదేవి అమ్మవారి జన్మదిన మహోత్సవ వేడుకలు వైభవంగా జరుగనున్నాయి. ఆదివారం ఉదయం 7 గంటలకు కలశాల గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు దేవస్థాన ట్రస్టు అధ్యక్షుడు గంజికుంట తిరుమలదాసు తెలిపారు. అదే రోజు అమ్మవారి అభిషేకం, మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నదానం, ప్రసాద వితరణ జరుగుతుంది. మధ్యాహ్నం 3 గంటల నుంచి అమ్మవారికి కుంకుమార్చన, మహామంగళహారతి, ప్రసాద వితరణ జరుగుతుంది. ఈ వేడుకల్లో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రేపు జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ జట్టు ఎంపిక

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 2: ఉమ్మడి కడపజిల్లా బాల్‌బాడ్మింటన్ జట్టు ఎంపిక ఆదివారం దువ్వూరులోని క్రిస్టియన్ కాలనీ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నట్లు వైఎస్ఆర్ జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు క్రిష్ణమూర్తి, కార్యదర్శి వెంకటరమణ తెలిపారు. సబ్‌జూనియర్ విభాగంలో పాల్గొనే క్రీడాకారులు 2009 జనవరి 2వ తేదీ తర్వాత, జూనియర్ విభాగంలో పాల్గొనేవారు 2005 జనవరి 2 తర్వాత పుట్టిన వారు పోటీల్లో పాల్గొనడానికి అర్హులని తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనపరచిన క్రీడాకారులను త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. ఇతర వివరాలకు 9490181104 నంబరులో సంప్రదించాలని కోరారు.

వినతులకు సకాలంలో స్పందించండి

పోరుమామిళ్ల, ఆగస్టు 2 : ప్రజల నుంచి వచ్చే వినతులకు సకాలంలో స్పందించి వారి సమస్యలు పరిష్కరించాలని బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధా అన్నారు. శుక్రవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో మండల సర్వసర్వసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖలవారీగా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు సీఎంబాషా, రంగసముద్రంసర్పంచ్ చిత్తా రవిప్రకాశ్‌రెడ్డి, జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, పోరుమామిళ్ల సర్పంచ్ యమనల సుధాకర్, టేకూరుపేట సర్పంచ్ రమణారెడ్డి, ఎంపీటీసీ కల్వకూరి రమణ, ఎంపీడీవో వరప్రసాదరావు, స్పెషల్ ఆఫీసరు చంద్రశేఖర్, మండల ఉపాధ్యక్షులు చెన్నురాజశేఖర్ పాల్గొన్నారు.

వైభవంగా గ్రామదేవతలకు చీరె-సారె



కోలాటం వేస్తూ అమ్మవారికి చీరెసారె తీసుకువస్తున్న భక్తులు

ఎర్రగుంట్ల, ఆగస్టు 2: ఆషాఢ మాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని ఎర్రగుంట్లలోని ఏరువాక గంగమ్మ ఆలయ సేవాసమితి ఆధ్వర్యంలో గ్రామదేవతలకు చీర-సారె కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నడివూరు రామాలయం వద్ద వెలసిన పెద్దమ్మకు మహిళలు సారె సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ముద్దనూరు రోడ్డులో వెలసిన చౌడమ్మ అమ్మవారికి చీరసారె సమర్పించి పూజలు నిర్వహించారు. సాయంత్రం నడివూరు రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి మేళతాళాలతో మహిళలు చీరె-సారెలు తీసుకుని ఏరువాక గంగమ్మ ఆలయానికి వచ్చారు. పూజల అనంతరం అమ్మవారి కి పల్లకీసేవను నిర్వహించారు. కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలను, అల్పాహారాన్ని ఏర్పాటు చేశారు.

పెద్దదుద్యాల గ్రామస్థుల ప్రాణాలకు రక్షణ కల్పించాలి



నిరసన చేస్తున్న గ్రామస్థులు

ముద్దనూరు ఆగస్టు2: విషపూరిత ఫ్యాక్టరీ నుంచి పెద్దదుద్యాల గ్రామస్థులకు రక్షణ కల్పించాలని రాయలసీమ రాష్ట్ర అధ్యక్షుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు.మండల పరిధి పెద్దదుద్యాల గ్రామ సమీపంలోని జీఎం ఎకో కెమికల్ ఫ్యాక్టరీ వద్ద ఫ్యాక్టరీ మూతవేయాలని పెద్దదుద్యాల గ్రామ ప్రజలు చేపడుతున్న నిరసన కార్యక్రమం శుక్రవారానికి పదో రోజుకు చేరుకుంది. గ్రామస్థులకు కుంచం వెంకటసుబ్బారెడ్డి సంఘీభావంగా నిరసనలో కూర్చున్నారు.ఫ్యాక్టరీలోని పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంత ప్రమాదకరమైన ఫ్యాక్టరీకి పొల్యూషన్ వారు ఏవిధంగా అనుమతి ఇచ్చారని ప్రశ్నించారు.ఫ్యాక్టరీలోని ప్రమాదకరమైన రసాయనిక ,కెమికల్ వల్ల గాలి, నీరు కలుషితమవుతున్నాయన్నారు.ఎంపీ అవినాష్‌రెడ్డి పులివెందులకు ఈ రోడ్డు మార్గం గుండా వెళుతుంటారని, ఆయనకు విషపూరితమైన దుర్వాసన ఎప్పుడు రాలేదా అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాము, బాషా, సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో పింఛన్ ప్రారంభించనందుకు ఆరుగురికి షోకాజ్ నోటీసులు

పోరుమామిళ్ల, ఆగస్టు 2 : అధికారులు నిర్దేశించిన సమయాని కన్నా ఆలస్యంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ప్రారంభించినందుకు ఆరుగురికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నట్లు ఎంపీడీవో వరప్రసాదరావు తెలిపారు. 1వతేదీన ఉదయం 5గంటలకే పింఛన్ పంపిణీ కార్యక్రమం చేయాల్సి ఉండగా మండలంలో ఆరుగురు ఉద్యోగులు ఆలస్యంగా పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. దీంతో సీఈవో ఆదేశాల మేరకు వారికి నోటీసులు జారీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఆసుపత్రికి వెళ్లి పెన్షన్ పంపిణీ

బద్వేలు, ఆగస్టు 2: మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డుకు చెందిన సుబ్బరాయుడు అనే వ్యక్తి అనారోగ్య కారణంగా కడపలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా ఈ విషయాన్ని ఆ వార్డు టీడీపీ ఇన్‌చార్జి బద్వేలు శివకుమార్ సచివాలయ వెల్ఫేర్ ఆఫీసర్ ముద్దుకృష్ణమనాయుడు దృష్టికి తీసుకుపోగా స్పందించిన ఆయన పెన్షన్‌దారుడైన సుబ్బరాయుడుకు బద్వేలు నుంచి కడప ఆసుపత్రికి వెళ్లి పెన్షన్‌ను అందించారు. ఇందుకు శివకుమార్, ఆయన కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తికి పింఛన్ అందజేత



పింఛన్ అందిస్తున్న మాజీ సర్పంచ్, వెల్ఫేర్ ఆఫీసర్

ఖాజీపేట, ఆగస్టు 2: మండల పరిధిలోని చెముళ్లపల్లె పంచాయతీ మునిపాక గ్రామానికి చెందిన ముత్తులూరుపాడు సుబ్బరాయుడు కర్నూలులోని ఓమ్నీ ఆస్పత్రిలో గుండెకు బైపాస్ సర్జరీ చేయించుకున్న అతనికి మాజీ సర్పంచ్ వెంకటరామిరెడ్డి, వెల్ఫేర్ ఆఫీసర్ సుబ్బారెడ్డి వెళ్లి రూ.4 వేలు పింఛన్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుబ్బరాయుడు తొందరగా కోలుకుని తిరిగి స్వగ్రామానికి రావాలని అన్నారు. ఆస్పత్రిలో పింఛన్ అందించడంతో ఆయన చాలా సంతోషం వ్యక్తం చేశారన్నారు.

వందశాతం పింఛను పంపిణీ

గోపవరం, ఆగస్టు 2 : పింఛను పంపిణీలో గోపవరం ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది వందశాతం పంపిణీ చేయడం పట్ల లబ్ధిదారులతో పాటు ప్రజాప్రతినిధులు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారని ఎంపీడీవో రాధాక్రిష్ణ తెలిపారు. ఇందులో భాగంగా 1న ఉదయం 6గంటల నుంచి పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నిద్ర లేవకముందే డోరు తట్టి మరీ పింఛన్లు పంపిణీ చేయడంతో మరింత ఆశ్చర్యానికి దారి తీసిందని మండల ప్రజలు తెలిపారు. మండల పరిధిలో ఏడు గ్రామ పంచాయతీల్లో 2663మందికి పింఛను పంపిణీ చేశామన్నారు.

'అందరి సహకారంతో పనిచేశా'



సీఐ రామాంజులును సన్మానిస్తున్న దృశ్యం

ఖాజీపేట, ఆగస్టు 2: అందరి సహకారంతోనే మండల పరిధిలో పనిచేశానని ఖాజీపేట సీఐ రామాంజులు అన్నారు. శుక్రవారం రాత్రి వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మైదుకూరు డీఎస్పీ వెంకటేషులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికల్లో ఎక్కడా ఎటువంటి సంఘటనలు జరుగకుండా ప్రజల సహకారంతో పనిచేశానన్నారు. ఖాజీపేటను వదిలి మంత్రాలయం వెళ్లడం బాధగా ఉన్నప్పటికి బదిలీలు తప్పవని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, వైసీపీ నాయకులు మైదుకూరు సీఐ మస్తాన్, ఎస్ఐ మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.అనంతరం సీఐ రామాంజులుకు ఘన సన్మానం చేశారు.

విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ పాండురంగన్‌రవి

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 2: విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ప్రముఖ ఇన్స్పిరేషనల్ స్పీకర్ నాగప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం ఎస్ఆర్ఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్, డిప్లమో మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ముఖ్య ఉద్దేశ్యం గమ్యం చేరడమేనని, గమ్యాన్ని చేరడానికి ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలన్నారు. కళాశాల ఛైర్మన్ బసిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకుని తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని సూచించారు. కరస్పాండెంట్ వీరకల్యాణ్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, సమయపాలనతోపాటు బాధ్యతలను కూడా గుర్తించాలని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన ఫ్లాష్‌మాబ్ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ లో చేరిన నలుగురు వైసీపీ కౌన్సిలర్లు



వరదరాజులరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్లు

ప్రొద్దుటూరు ,ఆగస్టు 2 : ప్రొద్దుటూరులో నలుగురు వైసీపీ కౌన్సిలర్లు టీడీపీలో చేరారు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి శుక్రవారం టీడీపీ కార్యాలయంలో వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్లు 8 వవార్డు రాగుల శాంతి, 24 వవార్డు కమాల్‌బాషా, 29 వవార్డు మోతుకూరి జయలక్ష్మీ, 40 వవార్డు రావుల కొల్లు అరుణ లు వున్నారు. తామంతా ఎమ్మెల్యేవరదరాజులరెడ్డి నాయకత్వంలో పనిచేస్తామని తెలపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిసురేష్ నాయుడు.టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ మున్సిపల్ ఇన్‌చార్జ్ ఛైర్మన్ వీఎస్ ముక్తియార్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, మాజీ ఎంపీపీ గురివిరెడ్డి, పట్టణ టీడీపీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు ఘంటశాల వెంకటేశ్వర్లు మాజీ మున్సిపల్ వైస్‌ఛైర్మెన్లు కామిశెట్టి బాబు, చౌడం కొండయ్య, 19 వవార్డు కౌన్సిలరు మునీర్ పాల్గొన్నారు.

వలంటీర్లు లేకుండానే వంద శాతం పింఛన్ల పంపిణీ

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 2: వలంటీర్ల సహాయం లేకుండానే వృద్ధులకు తెలుగుదేశం ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 1వ తేదీనే వంద శాతం పింఛన్లను పంపిణీ చేసిందని టీడీపీ బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి సుంకర వేణుగోపాల్ పేర్కొన్నారు. శుక్రవారం టీడీపీ బీసీసెల్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఎన్నికలను దృష్టిలో ఉంచుకున్న వలంటీర్లు లేరనే సాకుతో మండుటెండలో వృద్ధులు బ్యాంకులు, సచివాలయాలకు వెళ్లేలా చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు గోమేధికం సుదర్శన్, టీడీపీ బీసీ సెల్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సుబ్బరాజు, తెలుగుయువత నాయకులు సమర, మహేష్‌బాబు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు అమృతం లాంటివి



గోపవరంలో మాట్లాడుతున్న సీడీపీవో శ్రీదేవి

ఖాజీపేట, ఆగస్టు 2: తల్లిపాలు బిడ్డకు అమృతంలాంటివని జిల్లా రాష్ట్రీయ బాలసురక్ష కో-ఆర్డినేటర్ రమేష్ అన్నారు. శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన అవగాహన సదస్సుల్లో ఆయన పాల్గొన్నారు. వైద్యాధికారులు ముబీన్, ఆయేషాసుల్తాన్, ఆరోగ్య విస్తరణాధికారి నాగభూషణం, కమిటీ హెల్త్ ఆఫీసర్ స్వర్ణలత, హెల్త్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, ఆశాలు, ఏఎన్ఎంలు, అంగన్వాడీ టీచర్స్ సత్యవతి పాల్గొన్నారు.

గోపవరం..: ప్రతి శిశువుకు తల్లిపాలు వరంలాంటివని సీడీపీవో శ్రీదేవి అన్నారు. గోపవరం మండలంలోని చెన్నవరం, చిన్నగోపవరం అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం ప్రపంచతల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు.వైద్యాధికారి మహేశ్వర్‌రెడ్డి ,ఐసీడీఎస్ సూపర్‌వైజరు, అంగన్వాడీలు, సీహెచ్‌వో గౌస్ పాల్గొన్నారు.

బద్వేలు రూరల్..: బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందని తొట్టిగారిపల్లె వైద్యాధికారి వినయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తొట్టిగారిపల్లె, తిరువెంగలాపురం గ్రామాలో తల్లిపాల వారోత్సవాలు, శుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మలేరియా సబ్‌యూనిట్ అధికారి బ్రహ్మజీ, సీహెచ్‌వో చంద్రవతి. సూపర్‌వైజరు వెంకటమ్మ, హెల్త్ అసిస్టెంటు జనార్ధన్ రావు, ఖాసిం, శ్రీరాములయ్య తదితరులు పాల్గొన్నారు.

పెద్దముడియం..: పుట్టిన ప్రతి బిడ్డకూ ముర్రుపాలు పట్టించాలని ఆ పాలలో వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని ఐసీడీఎస్ సీడీపీవో రాజేశ్వరి, సూపర్‌వైజరు వెంకటలక్ష్మి తెలిపారు. మండల పరిధిలోని పెద్దపసుపుల గ్రామంలో తల్లిపాల వారోత్సవాలపై శుక్రవారం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని మాధవస్వామి దేవాలయ సమీపంలో అంగన్వాడీ కేంద్రం వద్ద ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి గ్రామంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజరు శాంతికుమారి, ఏఎన్ఎంలు బుజ్జి, ఐసీడీఎస్ అధికారులు అంగన్వాడీ టీచర్లు,ఆశావర్కర్లు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల తహసీల్దార్‌గా శోభన్‌బాబు

ఎర్రగుంట్ల, ఆగస్టు 2: ఎర్రగుంట్ల తహసీల్దార్‌గా కే.శోభన్‌బాబును ప్రభుత్వం నియమించింది. ఆయన గతంలో కొండాపురం తహసీల్దార్‌గా పనిచేస్తూ ఎన్నికల సందర్భంగా అనంతపురం జిల్లా శింగనమలకు బదిలీపై వెళ్లారు. అక్కడి నుంచి ఎర్రగుంట్ల తహసీల్దార్‌గా నియమితులైయ్యారు. సోమవారం ఆయన విధుల్లో చేరనున్నట్లు తెలిసింది. కాగా ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేస్తున్న సౌజన్యలక్ష్మి అనంతపురం జిల్లా లేపాక్షికి బదిలీపై వెళ్లారు.

గోపవరం ...ఉదయభారతి

గోపవరం, ఆగస్టు 2 : గోపవరం తహసీల్దారుగా ఉదయభారతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక తహసీల్దరు కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ గ్రామస్థాయి రెవెన్యూసిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఖాజీపేట...సరస్వతి

ఖాజీపేట, ఆగస్టు 2: ఖాజీపేట తహసీల్దారుగా శుక్రవారం టి.సరస్వతి బాధ్యతలు చేపట్టారు. ఈమె గతంలో కమలాపురం తహసీల్దారుగా పనిచేస్తూ ఎన్నికల నియమావళిపై వేరే జిల్లాకు వెళ్లి ప్రస్తుతం ఖాజీపేట తహసీల్దారుగా బదిలీ అయ్యారు. ఈ కార్యక్రమంలో బీటీ రవి, వీఆర్వోలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.